www.prajavinikidi.com RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -192 గురువారం 29 అక్టోబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు

**48.54 లక్షల మంది ఉద్యోగులు, 68.71 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి**




**న్యూఢిల్లీ,అక్టోబర్ 28: (ప్రజావినికిడి):** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. కరవు భత్యం (డీఏ), కరవు ఉపశమనం (డీఆర్)ను 3 శాతం పెంచుతూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం 60 శాతంగా ఉన్న డీఏ, డీఆర్ తాజా పెంపుతో 63 శాతానికి చేరనున్నాయి. ఈ పెంపు 2026 జూలై 1 నుంచి అమల్లోకి వస్తుంది. దేశవ్యాప్తంగా సుమారు 48.54 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68.71 లక్షల మంది పెన్షనర్లు ప్రయోజనం పొందనున్నారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏడాదికి రూ.10,016.10 కోట్ల అదనపు భారం పడనుంది. పెరిగిన ధరల ప్రభావం నుంచి ఉద్యోగులు, పెన్షనర్లకు కొంత ఉపశమనం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం మిగతా2లో...



## కరువును సమిష్టిగా ఎదుర్కొందాం!

**అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి**

**ముందస్తు చర్యలు చేపడుతున్నాం.. కేంద్రానికి ఇప్పటికే నివేదిక పంపించాం**

**అవసరమైతే ఢిల్లీకి అఖిలపక్ష బృందం**

**విపక్షాల సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**హైదరాబాద్,అక్టోబర్ 28: (ప్రజావినికిడి):** ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఏర్పడిన కరువు పరిస్థితులను అందరం కలిసికట్టుగా ఎదుర్కొందామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అఖిలపక్ష నేతలకు విజ్ఞప్తి చేశారు. కరువు నివారణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన అధ్యక్షతన ఎల్‌నినో మిగతా2లో...

## అప్రమత్తంగా ఉండండి..

**- తాగునీటి సమస్య రానివ్వొద్దు!**

**ఎల్‌నినో నేపథ్యంలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు**

**క్యూర్ ఏరియాలో మురుగునీటి శుద్ధి కేంద్రాలు వందశాతం పనిచేయాలి**

**భవన నిర్మాణాలు, పార్కులు, రోడ్ల శుభ్రతకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలి**

**శుద్ధి చేసిన నీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ.. నవంబర్ 1 నుంచి ఆదేశాల అమలు**



**హైదరాబాద్,అక్టోబర్ 28: (ప్రజావినికిడి):** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని జలాశయాల్లో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం, శుద్ధి చేసిన నీటి వినియోగంపై బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ క్యూర్ ఏరియాలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) వందశాతం సామర్థ్యంతో మిగతా2లో...

## ఓటరు జాబితాలో పేరుంటే మళ్లీ ఫారం6 ఎందుకు?

**- ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు**




**(ప్రజావినికిడి):** ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. గతంలో ఓటర్లుగా నమోదైన వారి పేర్లు తొలగించినప్పుడు, మళ్లీ ఫారం6 సమర్పించాలని ఎందుకు కోరుతున్నారని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది. సాధా రణంగా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేవారు ఫారం6 ఉపయోగిస్తారని ధర్మాసనం గుర్తుచేసింది.ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని మిగతా2లో...

## ఏపీలో పరిషత్ ఎన్నికలు వాయిదా!

**● నవంబర్ 5న ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్**

**● 7వ తేదీన ఓట్ల లెక్కింపు.. ఎన్నికల సంఘం షెడ్యూల్‌లో మార్పులు**



**అమరావతి,అక్టోబర్ 28:(ప్రజావినికిడి):** ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక మార్పులు చేసింది. నవంబర్ 3న నిర్వహించాల్సిన పోలింగ్‌ను నవంబర్ 5కు వాయిదా వేసింది. అదే రోజు జరగాల్సిన ఓట్ల లెక్కింపును నవంబర్ 7కు మార్చింది. ఈ మేరకు ఎన్నికల సంఘం బుధవారం ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల నిర్వహణలో సిబ్బంది కొరత, ఇతర ఏర్పాట్ల పరంగా ఇబ్బందులు తలెత్తకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. **మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌లోనూ మార్పులు** ఇప్పటికే పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌లో ఎన్నికల సంఘం మార్పులు చేసింది. మిగతా2లో...

## ఉద్యోగులు ఏఐపై అవగాహన పెంచుకోవాలి

**- ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు సాంకేతికతను వినియోగించాలి: భట్టి విక్రమార్క**




2లో

## వణికిస్తున్న అర్నాబ్ తుపాను!

**పంటలకు తీవ్ర నష్టం.. అప్రమత్తమైన అధికార యంత్రాంగం**



2లో



## మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే!

**● ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఢిల్లీ వెళ్లి తీరుతాం: మహేశ్‌కుమార్ గౌడ్ ● ప్రత్యేక రైళ్లు కేటాయించకపోవడంపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం**

**హైదరాబాద్,అక్టోబర్ 28** మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న 'ఓట్ బచావోదేశ్ బచావో' నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు మిగతా2లో...

## రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన!

**సబితా ఇంద్రారెడ్డి హౌస్ అరెస్టుపై హరీశ్‌రావు ఖండన**

**ప్రజల గొంతు నొక్కడం సరికాదు: నిరంజన్‌రెడ్డి**



**హైదరాబాద్, అక్టోబర్ 28: ((ప్రజావినికిడి):** మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని గృహ నిర్బంధం చేయడంతో పాటు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్ నేత కార్తిక్‌రెడ్డిని అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్‌ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష నేతలను నిర్బంధిస్తూ రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన సాగించడం సిగ్గుచేటని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు.

మిగతా2లో...

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# అప్రమత్తంగా ఉండండి..

(మొదటి పేజీ తరువాయి)

పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శుద్ధి చేసిన నీటిని వృథా చేయకుండా వివిధ అవసరాలకు వినియోగించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో నీటి అవసరాలు పెరిగే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే తగిన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. **భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీటినే వాడాలి**సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయం, ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు పరిధి, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణకు శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని సీఎం సూచించారు. పబ్లిక్ పార్కుల నిర్వహణ, రోడ్ల శుభ్రతకు కూడా శుద్ధి చేసిన నీటినే ఉపయోగించాలని ఆదేశించారు. భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగించాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.ప్రైవేటు మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా కేంద్రాలకు కూడా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్టీపీల నిర్వహణకు సౌర విద్యుత్తును వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. శుద్ధి కేంద్రాల్లో ఆధునిక సాంకేతిక ప్రమాణాలను పాటించాలని, నీటి నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. **శుద్ధి కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ**ప్రతి మురుగునీటి శుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అన్ని కేంద్రాలను కమాండ్ కంట్రోల్ కేంద్రంతో అనుసంధానించి, వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ట్యాంకర్లను గుర్తించి పర్యవేక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ నీటి వినియోగంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, శుద్ధి చేసిన నీటి సరఫరా కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్టీపీల నిర్వహణ, శుద్ధి చేసిన నీటి వినియోగానికి సంబంధించి నవంబర్ 1 నుంచి ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రస్తుతం 26 మురుగునీటి శుద్ధి కేంద్రాల నుంచి శుద్ధి చేసిన నీటిని పచ్చరంగు ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వినియోగదారుల నుంచి కేవలం రవాణా ఛార్జీలు మాత్రమే వసూలు చేస్తున్నామని, నీటిని ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. **సమీక్షలో ఉన్నతాధికారులు** ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్‌రాజ్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, టీజీఎస్‌పీడీసీఎల్ ఎండీ జితేష్ వి. పాటిల్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కరువును సమిష్టిగా ఎదుర్కొందాం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో రాజకీయ విమర్శలకు తావివ్వకుండా ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా అన్ని పార్టీలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. **కేంద్రానికి నివేదిక.. అవసరమైతే ఢిల్లీకి అఖిలపక్షం**రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక పంపించామని భట్టి విక్రమార్క వెల్లడించారు. అవసరమైతే అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి తెలంగాణకు రావాల్సిన సహాయంపై కేంద్రాన్ని కోరుతామని తెలిపారు. సమావేశంలో వివిధ పార్టీల నేతలు చేసిన సూచనలను నమోదు చేసుకున్నామని, సాధ్యమైన మేరకు వాటిని ప్రభుత్వ కార్యాచరణలో భాగంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.ఎల్‌నినో ప్రభావంపై గతంలో శాసనసభలో చర్చించామని, శాస్త్రవేత్తలు, నిపుణులతో సంప్రదింపులు జరిపామని వివరించారు. కరువు పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసిందని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి అవసరమైన సన్నద్ధతతో ఉన్నామని తెలిపారు.**తాగునీరు, పశువుల మేతకు ప్రాధాన్యం** దేశవ్యాప్తంగా వర్షపాతం లోటు ఉండటంతో పాటు ఎగువ రాష్ట్రాల్లోనూ వర్షాలు తక్కువగా కురవడం వల్ల ప్రాజెక్టుల్లోకి నీటి ప్రవాహాలు తగ్గాయని భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని వనరులను సమర్థంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. వర్షాభావ ప్రభావాన్ని తగ్గించేందుకు శాఖలవారీగా సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

# రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన!

(మొదటి పేజీ తరువాయి)

**రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు** కాంగ్రెస్ ప్రభుత్వం కరువు బారిన పడిన రైతులను, కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడం మానేసి, మూసీ ప్రక్షాళన పేరుతో రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పడం ఏమిటని హరీశ్‌రావు ప్రశ్నించారు. కరువు బాధిత రైతులను ఆదుకోవడంపై చూపాల్సిన శ్రద్ధను ప్రభుత్వం చూపడం లేదని విమర్శించారు. **రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి** మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా తనను, తన కుమారుడిని గృహ నిర్బంధం చేయడంపై మాజీ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోకుండా మూసీ ప్రాజెక్టుకు రూ.1.40 లక్షల కోట్లు ఖర్చు చేస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కరువు బారిన పడిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని, కాళేశ్వరం నీటిని వినియోగించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్బంధాలకు పాల్పడినా ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు .**ప్రజాభిప్రాయ సేకరణ అందరితో జరపాలి** ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో ప్రజల గొంతు నొక్కడం సరికాదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సబితా ఇంద్రారెడ్డి, ఇతర బీఆర్ఎస్ నేతల అరెస్టులను అక్రమంగా అభివర్ణించారు. మూసీ ప్రజాభిప్రాయ సేకరణ విషయంలో ప్రభుత్వం విభజించి పాలించే విధానాన్ని అనుసరిస్తోందని విమర్శించారు. ప్రజలందరితో ఒకేసారి అభిప్రాయ సేకరణ జరపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ తప్పులకు ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదని హెచ్చరించారు.

# 12 మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు

- జయేష్ రంజన్‌కు పర్యావరణ శాఖ
- వికాస్ రాజ్‌కు ఇంధన శాఖ బాధ్యతలు



**హైదరాబాద్, అక్టోబర్ 28: (ప్రజావినికిడి):** తెలంగాణ రాష్ట్రంలో పరిపాలనా సౌలభ్యం, శాఖల నిర్వహణ అవసరాల దృష్ట్యా ప్రభుత్వం 12 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. పలువురు అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీలు, నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్‌ను పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధన సంస్థ (ఈపీటీఆర్ఐ) డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న వికాస్ రాజ్‌ను ఇంధన శాఖకు బదిలీ చేశారు. ఇంధన శాఖలో పనిచేస్తున్న నవీన్ మిట్టల్‌ను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు.ఏ. వాణిప్రసాద్‌కు తెలంగాణ పురావస్తుశాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. శైలజా రామయ్యర్‌ను రెవెన్యూ శాఖలో దేవాదాయ విభాగం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిగా నియమించారు. కే. ఇలంబర్తిని రవాణా, రహదారులు, భవనాల శాఖ కార్యదర్శిగా నియమించి, రవాణా శాఖ కమిషనర్ బాధ్యతలు కూడా అప్పగించారు. ఆయన పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖల కార్యదర్శిగా అదనపు బాధ్యతల్లో కొనసాగుతారు.హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా, జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి పురపాలక సంస్థల ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బాధ్యతలు అదనంగా ఇచ్చారు. ఆయన వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాధ్యతల్లోనూ కొనసాగుతారు.మహిళా, శిశు సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా శృతి ఓఝూను నియమించారు. ఎస్. సంగీత సత్యనారాయణను ఆ శాఖ డైరెక్టర్‌గా నియమించారు. మహమ్మద్ ముషారఫ్ అలీ ఫారూఖీని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా నియమించి, తెలంగాణ రైతు విద్యుత్తు పంపిణీ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్‌కు తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షుడు, నిర్వహణ సంచాలకుడిగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. పదవీ విరమణ నేపథ్యంలో ఎం. దానకిశోర్‌ను గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా తిరిగి నియమించారు.



# నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

**- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ప్రచార కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి**

**హైదరాబాద్, అక్టోబర్ 28: (ప్రజావినికిడి):** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి గురువారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఈ సదస్సు ద్వారా తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించనున్నారు.ఇదిలా ఉండగా, నవంబర్ 4న హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న సదర్ ఉత్సవానికి హాజరుకావాలని శ్రీ కృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, యాదాద్రి బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించింది. **గ్రామీణాభివృద్ధికి రూ.7,395 కోట్ల పథకం** ప్రధానమంత్రి వికసిత్ గ్రామ స్వరాజ్ యోజనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఐదేళ్లలో రూ.7,395.55 కోట్ల వ్యయంతో 202627 నుంచి 203031 వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దేశవ్యాప్తంగా 2.78 లక్షలకు పైగా గ్రామీణ స్థానిక సంస్థలకు ప్రయోజనం చేకూరనుంది.**కంటైనర్, క్రీడా వస్తువుల తయారీకి ప్రోత్సాహం** దేశీయ కంటైనర్ తయారీ పరిశ్రమను బలోపేతం చేసేందుకు రూ.10 వేల కోట్ల ప్రోత్సాహక పథకానికి ఆమోదం తెలిపారు. అలాగే క్రీడా వస్తువుల తయారీ రంగ అభివృద్ధికి రూ.1,856.67 కోట్లతో ఖేలో ఇండియా పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ నిర్ణయాలతో దేశీయ తయారీ రంగం, గ్రామీణ స్థానిక సంస్థల అభివృద్ధికి ఊతం లభించనుంది.

# ఓటరు జాబితాలో పేరుంటే మళ్లీ ఫారం6 ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి)

ధర్మాసనం విచారణ సందర్భంగా, చిరునామా మార్పులు, ఓటరు వివరాల సవరణలకు సాధారణంగా ఫారం8 ఉపయోగిస్తారని పేర్కొంది. పిటిషనర్ల తరపున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదిస్తూ, ఢిల్లీలో ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి సుమారు 43 లక్షల మంది పేర్లు తొలగించారని తెలిపారు. గతంలో ఓటర్లుగా నమోదైనవారిని తిరిగి చేర్చేందుకు ఫారం6 కోరడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని అభ్యంతరం వ్యక్తం చేశారు.ఎన్యుమరేషన్ ఫారాలను గడువు ముగిసిన తర్వాత కూడా స్వీకరించే అంశాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు సూచించింది. తుది ఓటర్ల జాబితా సిద్ధమయ్యే వరకు అర్హులైనవారు తమ వివరాలు సమర్పించేందుకు అవకాశం కల్పించాలని పేర్కొంది. ఈ ప్రక్రియపై ప్రజలకు అర్థమయ్యే భాషలో విస్తృత అవగాహన కల్పించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

# ఏపీలో పరిషత్ ఎన్నికలు వాయిదా!

(మొదటి పేజీ తరువాయి)

అక్టోబర్ 28న జరగాల్సిన పోలింగ్‌ను నవంబర్ 1కు, అక్టోబర్ 30న నిర్వహించాల్సిన ఓట్ల లెక్కింపును నవంబర్ 3కు మార్చింది. దీంతో నవంబర్ 3న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ఒకే రోజు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలీసు సిబ్బంది, ఇతర సిబ్బంది అందుబాటును దృష్టిలో ఉంచుకుని పరిషత్ ఎన్నికల తేదీలను సవరించినట్లు సమాచారం.**తాజా షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు** స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను కొనసాగించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ మార్పులు చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం నవంబర్ 5న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబర్ 6న అవసరమైన చోట రీపోలింగ్ చేపట్టనున్నారు. నవంబర్ 7న ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలను ప్రకటించనున్నారు.ఎన్నికల తేదీల మార్పుతో అధికారులు ఏర్పాట్లను సమన్వయం చేసుకునేందుకు అవకాశం కలగనుంది. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సవరించిన షెడ్యూల్‌కు అనుగుణంగా తమ ఎన్నికల కార్యక్రమాలను రూపొందించుకోవాల్సి ఉంటుంది.

# మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే!

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక రైళ్లు కేటాయించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఢిల్లీకి వెళ్లి నిరసనను విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు.**దక్షిణ మధ్య రైల్వే కార్యాలయం ఎదుట ధర్నా** ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు కేటాయించాలని కాంగ్రెస్ నేతలు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను కోరారు. ఇందుకు నిరాకరించడంతో బుధవారం సికింద్రాబాద్‌లోని జీఎం కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు మెరుపు ధర్నా చేపట్టారు. మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆందోళనలో పాల్గొన్నారు. అనంతరం పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.**బస్సుల్లో ఢిల్లీకి తరలింపు** ప్రత్యేక రైళ్ల కోసం ఆరు రోజుల ముందే దరఖాస్తు చేసినప్పటికీ చివరి నిమిషంలో తిరస్కరించారని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకునేందుకే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. అయినప్పటికీ తెలంగాణ నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి తరలివెళ్తారని తెలిపారు. ఇందుకోసం అవసరమైన బస్సులు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగే నిరసనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# వణికిస్తున్న అర్నాబ్ తుపాను!

- పంటలకు తీవ్ర నష్టం.. అప్రమత్తమైన అధికార యంత్రాంగం

**హైదరాబాద్, అక్టోబర్ 28: (ప్రజావినికిడి):**అర్నాబ్ తుపాను ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరి పంట నేలకొరగగా, పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలకు నష్టం వాటిల్లింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సరాసరి 10.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో పరిస్థితిని సమీక్షించి ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించగా, ఖమ్మం జిల్లాలో పరిస్థితులను బట్టి సెలవులు ప్రకటించాలని అధికారులు ఆదేశించారు. గోదావరి పరివాహక, లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తత పెంచి సహాయక బృందాలను సిద్ధంగా ఉంచారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, విద్యుత్ తీగలు, పాత గోడలు, పెద్ద చెట్లకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. పంట నష్టానికి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

# ఉద్యోగులు ఏఐపై అవగాహన పెంచుకోవాలి

**హైదరాబాద్, అక్టోబర్ 28: (ప్రజావినికిడి):**మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులందరూ కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవగాహన పెంచుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. ఏఐ సాధనాలను సమర్థవంతంగా వినియోగించుకొని ప్రభుత్వ పనులను వేగవంతం చేయడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో బుధవారం ప్రణాళికా శాఖ, టీజీ మ్యాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఏఐ సాక్షమ్' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వుల గుర్తింపు, నివేదికల తయారీ, సమాచార విశ్లేషణ, ప్రజల సమస్యల పరిష్కారం వంటి పనుల్లో కృత్రిమ మేధస్సు ఉపయోగపడుతుందని తెలిపారు. రైతుల దరఖాస్తులు త్వరగా పరిష్కారం కావడం, పింఛనుదారులకు అవసరమైన సమాచారం సులభంగా అందడం వంటి ప్రయోజనాలు ప్రజలకు కలగాలని పేర్కొన్నారు.

విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేయడం, పరికరాల్లో లోపాలను ముందుగానే గుర్తించడం, అభివృద్ధి పనుల్లో జాప్యానికి కారణాలను విశ్లేషించడం వంటి అంశాల్లోనూ ఏఐని వినియోగించుకోవచ్చని చెప్పారు. అయితే ఏఐ సాధనాలను ఉపయోగించేటప్పుడు సమాచార భద్రత, కచ్చితత్వం, బాధ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఏఐ ద్వారా లభించిన సమాచారాన్ని అధికారికంగా వినియోగించే ముందు ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ శాఖల్లో ఏఐ వినియోగానికి అనువైన పనులను గుర్తించి, తొలుత ప్రయోగాత్మకంగా అమలు చేసి ఫలితాల ఆధారంగా విస్తరించాలని భట్టి విక్రమార్క కోరారు.

# చట్ పూజోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



**అబిడ్స్, (ప్రజావినికిడి):** ప్రకృతికి ప్రత్యేకమైన మహత్తర చట్ పూజను గత మూడు దశాబ్దాల నుండి నిర్వహించడం జరుగుతుంది. ఉత్తర భారతీయులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే ఛట్ పూజోత్సవాలకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసేందుకు జీవో విడుదల చేయడంపై జన్ సేవా సంఘ్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.జన్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో నవంబరు13 నుంచి16వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఛట్ పూజోత్సవాలను నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు బిశ్వదీప్ సింగ్ వెల్లడించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో చట్ పూజోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నెక్లెస్ రోడ్,సంజీవయ్య పార్కుతో పాటు మొత్తం 30 ఘాట్‌లలో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబరు13,14 తేదీల్లో భక్తులు ఉపవాస దీక్షలు చేపడతారని, 15న సాయంత్రం సూర్యాస్తమయం సమయంలో నీటిలో నిలబడి సూర్యభగవానుడికి పూజలు చేస్తారని వివరించారు. 16న తెల్లవారుజామున5గంటల నుంచే సూర్యోదయ పూజలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.ఈ వేడుకలకు కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు. సుమారు లక్ష మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. ప్రకృతికి కృతజ్ఞతలు తెలుపుతూ సూర్యభగవానుడిని ఆరాధించడం ఛట్ పూజ ప్రత్యేకత అని తెలిపారు.ఉత్తర భారతదేశంతో పాటు నేపాల్‌లోనూ ఈ పండుగను ఘనంగా నిర్వహిస్తారని స్పష్టం చేశారు. భక్తుల సౌకర్యార్థం నవంబరు15,16 తేదీలను రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినాలుగా ప్రకటించాలని బిశ్వదీప్ సింగ్ కోరారు. సమావేశంలో జన్మదిన సెక్రెటరీ సురేష్ పండిత్, ట్రెజరర్ సునీల్ శ్రీ వాస్తవ్, కోఆర్డినేషన్ ఆర్.పిసింగ్, సీతారాం ఠాకూర్,బినీత్ సింగ్,మునావర్, రాదే శ్యామ్, జితేంద్ర సింగ్, ఆర్ ఎస్ ఆర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# హైమావతి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం : డాక్టర్ నరేష్



**హైదరాబాద్, (ప్రజావినికిడి):** 18 సంవత్సరాలుగా ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ పరిధిలో పేద ప్రజలకు సేవ చేస్తూ,హైదరాబాద్ అమీర్ పేట అపోలో స్పెక్ట్రా హాస్పటల్లో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య మిత్ర హైమావతి అనారోగ్యంతో బుధవారం హైదరాబాదులోని తన నివాసంలో చనిపోవడం జరిగింది.ఈ విషయాన్ని తెలుసుకున్న రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ జనరల్ మేనేజర్ డాక్టర్ నరేష్ కుమార్ ఆమె భౌతిక కాయానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించడంతోపాటు హైమావతి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాస్,డిస్టిక్ కోఆర్డినేటర్ సాయి నారాయణ గౌడ్,డిస్ట్రిక్ట్ మేనేజర్ పాషా, టీం లీడర్స్ చంద్రశేఖర్, వేణు,సంతోష్, ఆరోగ్య మిత్రాలు గిరి యాదయ్య, రాజు,సుమన్, విష్ణు,కుమార్, రత్నం, నాగరాజు, వజ్ర,స్వర్ణ,స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# ఒకే కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండాలి

**చిరునామా ఆధారిత ఓటర్ల జాబితా రూపొందించాలి**

**కేంద్ర ఎన్నికల సంఘానికి ది సిటిజన్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫ్ మహమ్మద్ వినతి**



**తెలంగాణ, (ప్రజావినికిడి): అక్టోబర్ 28,**
ఒకే ఇంట్లో నివసించే కుటుంబ సభ్యుల ఓట్లన్నీ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ది సిటిజన్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫ్ మహమ్మద్ భారత ఎన్నికల సంఘాన్ని కోరారు.ఓటర్లకు పోలింగ్ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను తొలగించి,ఓటర్ల జాబితాలో పారదర్శకతను పెంపొందించేందుకు చిరునామా ఆధారిత ఓటర్ల జాబితాను రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు దేశ రాజధాని ఢిల్లీలోని భారత ఎన్నికల సంఘాన్ని సందర్శించిన షేక్ ఆరిఫ్ మహమ్మద్ సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. 2002 అనంతరం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ద్వారా ఓటర్ల జాబితాలో కీలక మార్పులు తీసుకురావడంలో అధికారులు చేపట్టిన చర్యలను ఆయన అభినందించారు. అయితే,ఒకే ఇంట్లో నివసించే కుటుంబ సభ్యుల ఓట్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాలకు కేటాయించడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఒకే చిరునామాలో నివసించే కుటుంబ సభ్యులను గుర్తించి,వారి ఓట్లను ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. ఓటర్ల చిరునామాల్లో ఉన్న అస్పష్టతలు, తప్పులను సరిచేయడంతో పాటు నకిలీ నమోదులను గుర్తించి తొలగించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని కోరారు.తద్వారా పారదర్శకమైన, కచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించవచ్చని వివరించారు. ఓటర్ల జాబితాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైతే రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు (ఆర్‌డబ్ల్యూఏలు),పౌర సంఘాల సహకారం తీసుకోవాలని షేక్ ఆరిఫ్ మహమ్మద్ సూచించారు. బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో నివాస వివరాలను ధ్రువీకరించాలని విజ్ఞప్తి చేశారు. స్థానికంగా నివసిస్తున్న వారి వివరాలను పరిశీలించడం ద్వారా చిరునామాల్లోని తప్పులను సరిచేయడంతో పాటు ఓటర్ల జాబితాలోని లోపాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఓటరు గుర్తింపు కార్డులను సంబంధిత ఓటర్లకు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా నేరుగా అందించాలని ఆయన కోరారు. రాజకీయ నాయకులకు అప్పగించి కార్డులను పంపిణీ చేసే విధానాన్ని నివారించాలని సూచించారు. ఓటరు గుర్తింపు కార్డులు అర్హులైన వ్యక్తులకు సక్రమంగా చేరేలా పారదర్శకమైన పంపిణీ వ్యవస్థను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఓటర్లకు ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించడం, పోలింగ్ ప్రక్రియను సులభతరం చేయడం, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడం కోసం ఎన్నికల సంఘం ఈ అంశాలపై ప్రాధాన్యతతో స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని షేక్ ఆరిఫ్ మహమ్మద్ కోరారు.

# పచ్చని పల్లెలపై పరిశ్రమ కాలుష్యపు పంజా..

**కాలుష్యపు నీరు చెరువుల్లోకి చేరి చనిపోతున్న చేపలు..**

**కాలుష్యాన్ని వెదజల్లుతున్న ఓం శివశక్తి పరిశ్రమ**

**ఆందోళనకు దిగిన కందివనం,పరిసర గ్రామాల ప్రజలు..**



చెరువుల్లోకి చేరుతున్న కాలుష్యపు నీరు

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్ నగర్ నియోజకవర్గంలోని ఆ పరిశ్రమలోకి అడుగుపెడితే ఎక్కడ చూసినా విపరీతమైన నల్లటి పొగ దుమ్ము,ధూళి కనిపిస్తాయి.మరోవైపు కాలుష్యపు నీటి కాలువల ద్వారా గ్రామీణ ప్రాంతంలో ఉన్న చెరువులలో చేరుతున్నాయి.విపరీతమైన పొగ గ్రామస్తుల పంట పొలాలను కమ్ముకుంటుంది..పాఠశాల విద్యార్థులను సైతం ఈ పొగ భయపెడుతోంది.. ఫరూక్ నగర్ మండలం కందివనం గ్రామ పరిధిలోని ఓం శివశక్తి పరిశ్రమ వెదజల్లుతున్న కాలుష్యం ఇది. ఈ కాలుష్యం కారణంగా సమీపంలో ఉన్న కందివనం గ్రామం తో పాటు,చౌలపల్లి, గుండెగాని తండ,పిట్టలగడ్డ తండాలు ఈ పరిశ్రమ కారణంగా పొగబారిపోయాయి.ఈ పరిశ్రమ ద్వారా వెదజల్లే కాలుష్యపు నీరు నేరుగా వెళ్లి కందివనం గ్రామ సమీపంలోని చెరువులో కలుస్తుంది.ఇక దట్టమైన పొగను తన ఇష్టరాజ్యాంగా బయటికి వదులుతుండడంతో పశువులు అనారోగ్యం బారిన పడుతున్నాయని,వేసిన పంటలు, పూర్తిగానాశనంఅయిపోతున్నాయి.ఈ నేపథ్యంలోనే గ్రామస్తులు బుధవారం ఆందోళనకు దిగి,పరిశ్రమ ముందు టెంట్ వేసి ధర్నా నిర్వహించారు.
పరిశ్రమ నిర్వాహకులు వెంటనే స్పందించి పరిశ్రమలు మూసివేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.ఈ పరిశ్రమ కారణంగా ఆరోగ్యాలు పూర్తిగా పాడైపోతున్నాయని,ఎన్నిసార్లు హెచ్చరించినా పరిశ్రమ నిర్వాహకులుపట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత శాఖ అధికారులు, పొల్యూషన్ బోర్డ్,వెంటనే దీనిపై స్పందించకుంటే ఈ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని, పరిశ్రమలు మూసివేసే దాకా ఈ ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు.గ్రామ సర్పంచ్ జెమిని అమ్రు నాయక్,ఉప
సర్పంచ్ విజయ యాదగిరి,మాజీ సర్పంచ్ శివ జ్యోతి,మాజీ డిప్యూటీ సర్పంచ్ గోపాల్ గౌడ్,గ్రామ పెద్దలు శంకరయ్య గౌడ్,ఆంజనేయులు,వార్డు సభ్యుడు మల్లేష్,మహేష్ మహేందర్,చింతకింది చంద్రయ్య,వీరు నాయక్, మహిళలు,
యువకులు కార్యక్రమంలో పాల్గొన్నారు





# అధికారుల ఆదేశాలు కాగితాలకే పరిమితమా..

## ఎలికట్ట రోడ్డుపై ఆగని కేబుల్ కరెంట్ పనులు..

**పనులు నిలిపివేయాలని చెప్పినా,వినకుండా పనుల నిర్వహణ**

**ఆర్&బీ అధికారులు చర్యలు తీసుకుంటారా.?**

**త్వరలోనే నాలుగు లైన్ల రోడ్డుగా మారనున్న పరిగి రోడ్డు**



**షాద్‌నగర్,(ప్రజావినికిడి):** నియోజకవర్గంలోని ఎలికట్ట-పరిగి రహదారిపై కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ కరెంట్ కేబుల్ పనుల వ్యవహారం వివాదాస్పదంగా మారింది.రహదారిపై కేబుల్ పనులను నిలిపివేయాలని షాద్‌నగర్ రోడ్లు,భవనాల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్వప్నలత ఆదేశించినప్పటికీవాటిని పట్టించుకోకుండా పనులు కొనసాగిస్తున్నారు.
పనులు నిలిపివేయాలని సూచించి ఈనెల 24వ తేదీన సంబంధిత పనుల కాంట్రాక్టర్లకు నోటీసులు జారీచేసినప్పటికీ కేబుల్ పనులు ఇంకా కొనసాగుతుండటంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంబంధిత అధికారుల ఆదేశాలను అండర్ కేబుల్ కరెంట్ నిర్వాహకులు ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పష్టంగా సూచించినప్పటికీ పనులు కొనసాగుతుంటే సంబంధిత శాఖ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నది చర్చనీయాంశంగా మారింది. రోడ్డు మధ్యలో నుండి 10 మీటర్లు దూరంలో తవ్వకాలకు అనుమతులు ఇచ్చిన ఆర్& బి శాఖ,కానీ వాసవికంగా పనులు జరుగుతున్న ప్రాంతంలో(1)మీటర్ కే పరిమితమైన వైనం రోడ్డును ఆనుకొని తవ్వకాలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది.ఇప్పటికే ఎలికట్ట సమీపంలో రహదారి విస్తరణకు సంబంధించిన అంశాలు చర్చలో ఉన్న నేపథ్యంలో,భవిష్యత్తులో రహదారి నిర్మాణ పనులకు ఇబ్బందులు తలెత్తకుండా కేబుల్ పనులకు సంబంధించిన అనుమతులు,నిబంధనలను అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.
ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రజాప్రతినిధులు,



అధికారులు సూచనలు చేసినా పనులు ఎందుకు ఆగడం లేదన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఆర్&బీ ఉన్నతాధికారులు స్పందించి, కరెంట్ కేబుల్ పనులకు పై తగిన చర్యలు తీసుకుంటారా, లేక పనులు యథావిధిగా కొనసాగుతాయా,అనేది వేచి చూడాలి.

# వాజేడులో పి ఆర్ టి యు, తెలంగాణ కార్యవర్గ సమావేశం





**వాజేడు,అక్టోబర్ 29,(ప్రజావినికిడి):** మండల కేంద్రంలో పిఆర్టియు, తెలంగాణ కార్యవర్గ సమావేశం వాజేడు మండల అధ్యక్షులు కరుటూరి సతీష్ కుమార్ అధ్యక్షతన బుధవారం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ములుగు జిల్లా పిఆర్టియు తెలంగాణ అధ్యక్షులు కొయ్యడ సురేందర్,ప్రధాన కార్యదర్శి పోరిక రామన్న నాయక్, పాల్గొన్నారు జిల్లా అధ్యక్షులు ఈ సందర్భంగా మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పిఆర్సి, అమలు చేయాలని సిపిఎస్, విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్, విధానాన్ని పునరుద్ధరించాలని ఈఎచ్ఎస్, ద్వారా సక్రమమైన వైద్యం అందించేటట్లు అమలు చేయాలనిడిఎస్సి 2024 ఉపాధ్యాయులకు ప్రొబేషన్ డిక్లరేషన్ సర్వీస్ క్రమబద్ధీకరణ త్వరితగతిన జరిగే విధంగా డిడివో లు చర్యలు చేపట్టాలని కోరడం జరిగింది.ఈ సమావేశంలో వాంకుడోత్ భావు సింగ్ ని పిఆర్టియు, తెలంగాణ ములుగు జిల్లా ఉపాధ్యక్షుడిగా వాజేడు మండల పిఆర్టియు తెలంగాణ మహిళా అధ్యక్షురాలిగా కే.గీతాంజలిని ఎన్నుకోవడం జరిగింది.వారికి శుభాకాంక్షలు తెలియజేసి మండలంలోని ఉపాధ్యాయులు అందరిని ఐక్యం చేసి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించడం జరిగింది.ఈ కార్యక్రమం లో పిఆర్టియు అసోసియేట్ ప్రసిడెంట్ ఈ. రాజు,నూనావత్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాగులపల్లిలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** నియోజకవర్గంలోని ఫరూఖ్ నగర్ మండలం నాగులపల్లి గ్రామంలో హైదరాబాద్–మహబూబ్‌నగర్–రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్, పట్టభద్రుల ఎన్నికల ఇన్‌చార్జ్ బైకని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ,అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యావంతులుఆలోచనాత్మకంగాతమఓటుహక్కునువినియెాగించుకోవాలనిగత పాలనకు,ప్రస్తుత పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాలను పరిగణలోకి తీసుకొని సరైన నిర్ణయం తీసుకోవాలనిపిలుపునిచ్చారు.యువతకు ఉపాధి,విద్యతో పాటు వివిధ రంగాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం మేలు చేసిందని ఆయన పేర్కొన్నారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారం,యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థికి మద్దతు తెలిపి గెలిపించాలని పట్టభద్రులను కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్,బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్,స్థానిక సర్పంచ్ రాధిక అశోక్ రెడ్డి,మాజీ సర్పంచులు శ్రవణ్ పట్వారీ,శ్రీనివాస్ యాదవ్,మాజీ ఎంపీటీసీలు బిశ్వ రామకృష్ణ,రాధాకృష్ణ, నాయకులు యాదయ్య, పోచయ్య గౌడ్,వెంకటయ్య గౌడ్, నరసింహా, జనార్దన్ గౌడ్, మల్లారెడ్డి,శేఖర్ రెడ్డి,రఘురాం రెడ్డి, దొడ్డి శ్రీనివాస్,కాటి మల్లేష్ యాదవ్ నాగభూషణం,భరత్, రాజశేఖర్,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# పంచముఖ ఆంజనేయ స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలి:తోకల శ్రీనివాస్ రెడ్డి



**రాజేంద్రనగర్, (ప్రజావినికిడి): అక్టోబర్ 28,**
శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. భక్తులంతా ఐకమత్యంతో కలిసి పవిత్రమైన ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఉరగుట్ట వినాయక నగర్‌లో నిర్వహించిన శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ప్రతిష్ఠాపన మహోత్సవానికి తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, భక్తులతో కలిసి ప్రతిష్ఠాపన మండప దేవతా పూజలు, స్వామివారి అభిషేకం,మంత్ర హోమం,రుద్ర హోమం,గణపతి హోమం, ఆంజనేయ స్వామి ధ్యాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న శ్రీ పంచముఖ అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు, భక్త బృందం, స్థానిక యువకులకు ప్రత్యేక అభినందనలు తెలియజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శేషిధర్ రెడ్డి, గడ్డం మల్లేష్ యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, మహేందర్ ముదిరాజ్, యాదగిరి ముదిరాజ్, రాకేష్ రెడ్డి, లోకేష్ ముదిరాజ్, తరుణ్,నర్సింగ్ ముదిరాజ్, సురేందర్ రెడ్డి, రఘు,శంకర్ రెడ్డి,ప్రభాకర్, భుజంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్రా యాత్ర ముగించుకుని స్వదేశానికి చేరుకున్న 50 మంది యాత్రికులు

## మక్కా, మదీనాల్లో భారతీయుల క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు






**శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్ 28,** ఉమ్రా యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకున్న 50 మంది ఇస్లామిక్ యాత్రికులు క్షేమంగా భారత్‌కు చేరుకున్నారు. సుమారు 15 రోజుల క్రితం ఉమ్రా యాత్ర కోసం భారత్ నుంచి సౌదీ అరేబియాకు బయలుదేరిన వీరు,పవిత్ర మక్కా,మదీనా నగరాలను సందర్శించి ఆధ్యాత్మిక ప్రార్థనలు పూర్తి చేసుకుని స్వదేశానికి తిరిగి వచ్చారు.ఈ సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయంలో యాత్రికుల కుటుంబ సభ్యులు, బంధువులు వారికి పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు.దీంతో విమానాశ్రయంలో సందడి వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా ఆల్ మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ డైరెక్టర్ మహమ్మద్ ఫయాజ్ అలీ మాట్లాడుతూ,రానున్న రోజుల్లో ఎల్ నినో ప్రభావం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భారతీయులందరూ సురక్షితంగా, సంతోషంగా ఉండాలని పవిత్ర మక్కా, మదీనాలలో ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా వాటిని ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని భగవంతుడు అందరికీ ప్రసాదించాలని ప్రార్థించినట్లు వివరించారు. భారత్ నుంచి బయలుదేరినప్పటి నుంచి తిరిగి స్వదేశానికి చేరుకునే వరకు తమకు ఎలాంటి అసౌకర్యం కలగలేదని యాత్రికులు తెలిపారు. యాత్రలో వసతి, భోజనం,రవాణా తదితర అన్ని సౌకర్యాలను ఆల్మిజాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థ చక్కగా ఏర్పాటు చేసిందని ప్రశంసించారు. యాత్రికులకు అవసరమైన ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించిన సంస్థ నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.పవిత్ర మక్కా,మదీనా నగరాలను సందర్శించి ప్రార్థనలు చేయడం తమకు ఎంతో సంతృప్తినిచ్చిందని యాత్రికులు పేర్కొన్నారు. ఉమ్రా యాత్ర ద్వారా పొందిన ఆధ్యాత్మిక అనుభూతి, అనుభవాలు మరువలేనివని తెలిపారు.తమ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ అవకాశం కల్పించుకుని ఉమ్రా యాత్ర చేయాలని కోరారు. మొత్తంగా,15 రోజుల పాటు సాగిన ఉమ్రా యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని 50 మంది యాత్రికులు క్షేమంగా స్వదేశానికి చేరుకోవడంతో వారి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. విమానాశ్రయంలో ఆత్మీయ స్వాగతం పలుకుతూ తమ సంతోషాన్ని పంచుకున్నారు.

# యాసంగిలో వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

## ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

## రైతులకు వ్యవసాయ శాఖ అధికారుల సూచన





**శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్ 28:** ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వచ్చే యాసంగి సీజన్‌లో వరికి బదులుగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల పంటలను సాగు చేయాలని రాజేంద్రనగర్ వ్యవసాయ సహాయ సంచాలకులు సత్యనారాయణ రైతులకు సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యమివ్వాలని,నీటి సంరక్షణ పద్ధతులను పాటించాలని తెలిపారు. శంషాబాద్ మండల పరిధిలోని రామాంజపూర్ గ్రామంలో బుధవారం ఆత్మ (ఏటీఎంఏ) ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఫామ్ స్కూల్,'ఖేత్ బచావ్ అభియాన్' కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ,
వరిలో ఆశించే కాండం తొలుచు పురుగు, తెల్లదోమ నివారణకు అవసరమైన ఎరలను రైతులకు అందజేశారు. వాటిని ఏర్పాటు చేసే విధానం, వినియోగం, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో పంటల సాగు చేపట్టాలని అధికారులు సూచించారు. యాసంగిలో నీటి వినియోగాన్ని తగ్గించే పంటలను ఎంపిక చేసుకోవాలని, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల సాగు వైపు దృష్టి సారించాలని తెలిపారు.నీటిని పొదుపుగా వినియోగిస్తూ సుస్థిర వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని పేర్కొన్నారు. పంట కోతల అనంతరం మిగిలే వ్యర్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కాల్చరాదని అధికారులు రైతులకు సూచించారు. పంట వ్యర్థాలను నేలలో కలపడం ద్వారా సేంద్రియ కర్బనాన్ని పెంచి, నేల సారాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భూసారం పెంపొందించే పద్ధతులను పాటిస్తూ వ్యవసాయం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్వేత, వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మణ్,ఆత్మ ఏటీఎం శ్రీవిద్య, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# తుఫాను ఎఫెక్ట్.. హైదరాబాద్ నుంచి 13 విమానాలు రద్దు

## విజయవాడ, విశాఖ, రాజమండ్రి వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు

**శంషాబాద్, (ప్రజావినికిడి):**
అక్టోబర్ 28: తుఫాను ప్రభావంతో ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో హైదరాబాద్‌లోని శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పలు దేశీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి. మొత్తం 13 విమానాలను రద్దు చేసినట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు.ఈ నిర్ణయంతో విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి వెళ్లాల్సిన ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. విమానాశ్రయ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. విజయవాడకు వెళ్లాల్సిన మూడు విమానాలు, విశాఖపట్నానికి వెళ్లాల్సిన ఏడు విమానాలు, రాజమండ్రికి వెళ్లాల్సిన మరో మూడు విమాన సర్వీసులను రద్దు చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విజయవాడకు వెళ్లాల్సిన ఐసీ–3301 విమానం ఉదయం 6.05 గంటలకు, 6ఈ–6263 విమానం మధ్యాహ్నం 12.20 గంటలకు, 6ఈ–2580 విమానం సాయంత్రం 5.40 గంటలకు బయలుదేరాల్సి ఉండగా..ఈ మూడు సర్వీసులను రద్దు చేశారు. విశాఖపట్నానికి వెళ్లాల్సిన ఏడు విమానాలను అధికారులు రద్దు చేశారు.వీటిలో






ఐఎక్స్–2401 విమానం ఉదయం 7 గంటలకు, 6ఈ–714 విమానం ఉదయం 7.05 గంటలకు, 6ఈ–879 విమానం ఉదయం 10.55 గంటలకు బయలుదేరాల్సి ఉంది.అలాగే 6ఈ–208 విమానం మధ్యాహ్నం 2.50 గంటలకు, ఐఎక్స్–2403 విమానం సాయంత్రం 5.35 గంటలకు, 6ఈ–409 విమానం సాయంత్రం 6.50 గంటలకు, 6ఈ–6728 విమానం రాత్రి 8.45 గంటలకు బయలుదేరాల్సి ఉండగా..ఈ సర్వీసులను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. రాజమండ్రికి వెళ్లాల్సిన మూడు విమాన సర్వీసులు కూడా రద్దయ్యాయి. ఐసీ–3201 విమానం ఉదయం 7.25 గంటలకు, 6ఈ–7569 విమానం ఉదయం 8 గంటలకు, 6ఈ–7529 విమానం ఉదయం 10 గంటలకు బయలుదేరాల్సి ఉండగా..ఈ సర్వీసులు రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విమాన సర్వీసుల రద్దుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు టికెట్ల రీఫండ్, ప్రయాణ తేదీల మార్పు కోసం సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని అధికారులు సూచించారు. విమానాశ్రయానికి బయలుదేరే ముందు తమ విమాన సర్వీసుల తాజా స్థితిని అధికారిక వెబ్‌సైట్ లేదా సంబంధిత విమానయాన సంస్థ ద్వారా నిర్ధారించుకోవాలని సూచించారు. తుఫాను ప్రభావంతో విమాన ప్రయాణాల్లో అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో ప్రయాణికులు తమ ప్రయాణ ప్రణాళికలను ముందుగానే సమీక్షించుకోవాలని అధికారులు సూచించారు.

# నూతన వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం





**హయత్ నగర్,(ప్రజావినికిడి):**
అబ్దుల్లాపూర్ మెట్ మండలం కుంట్లూర్ డివిజన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో బీఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ బూడిద రామ్ రెడ్డి నూతన వాటర్ ప్లాంట్ ని ప్రారంభించారు.ఈ సందర్భంగా రామ్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ సర్పంచ్ ముద్దం వీరస్వామి యాదవ్,కుంట్లూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమగౌని భాస్కర్ గౌడ్,భీమగౌని గౌరి శంకర్ గౌడ్,మాజీ ఎంపిటిసిలు సందిల బాలరాజు గౌడ్, కళ్లెం రాములు,కొత్తకంటి.శ్రీనివాస్, పోలోజి బ్రహ్మచారి, భీమగౌని చిన్న గౌరిశంకర్ గౌడ్, మైసగౌని సంపత్ కుమార్ రచమల పోచయ్య,అనాజ్ పూర్ సర్పంచ్ రాచపాక నవనిత మహేష్,అనజ్ పూర్ వార్డ్ సభ్యులు రామ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు సందిల రోహిత్ గౌడ్,ఫౌండేషన్ సభ్యులు మంగ ఐలేష్,గోపాల్, సద్దాం,శేఖర్ యాదవ్,సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# దామోదర్ రావును మర్యాదపూర్వకంగా కలిసిన రాచమల్ల సురేష్ కుమార్



**శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్ 28,** రాజ్యసభ సభ్యుడు, 'నమస్తే తెలంగాణ' దినపత్రిక చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) దీవకొండ దామోదర్ రావును రాచమల్ల సురేష్ కుమార్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దామోదర్ రావుకు పుష్పగుచ్ఛం అందజేసి తన గౌరవాభిమానాలను, శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ భేటీ ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది.ఈ సందర్భంగా రాచమల్ల సురేష్ కుమార్, దామోదర్ రావు పరస్పరం పలకరించుకుని, పలు సామాజిక అంశాలతో పాటు సమకాలీన పరిణామాలపై కొద్దిసేపు చర్చించుకున్నారు.సమాజంలో చోటు చేసుకుంటున్న వివిధ పరిణామాలు, సామాజిక అంశాలపై ఇరువురు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా దామోదర్ రావు ఆప్యాయంగా పలకరించి,తన విలువైన సమయాన్ని కేటాయించడంతో రాచమల్ల సురేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. మర్యాదపూర్వకంగా జరిగిన ఈ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో సాగింది. రాజ్యసభ సభ్యుడిగా, ప్రముఖ దినపత్రిక సీఎండీగా బాధ్యతలు నిర్వహిస్తున్న దామోదర్ రావును కలవడం సంతోషంగా ఉందని రాచమల్ల సురేష్ కుమార్ పేర్కొన్నారు.

# అక్టోబర్ 30న 'ఓ నా సిద్ధయ్య' పాట ఆవిష్కరణ

### శంషాబాద్‌లో అంగరంగ వైభవంగా ఏర్పాట్లు

### సినీ ప్రముఖుల రాక.. -70 ఎంఎం థియేటర్ తరహాలో భారీ తెరపై ప్రదర్శన






**శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్ 28,**
సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువైన ప్రముఖ యువ వ్యాపారవేత్త, సామాజిక సేవకుడు కందగట్ల సిద్ధు రెడ్డి తొలిసారిగా సినీ రంగంలోకి అడుగుపెడుతున్నారు.ఆయన స్వీయ నిర్మాణంలో రూపొందించిన 'ఓ నా సిద్ధయ్య' పాట ఆవిష్కరణకు శంషాబాద్‌లో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ నెల 30న సాయంత్రం 5 గంటలకు శంషాబాద్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కందగట్ల సిద్ధు రెడ్డి మాట్లాడుతూ,
చిన్నప్పటి నుంచే చలనచిత్ర రంగంపై ఆసక్తి ఉండేదని,సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలన్న లక్ష్యంతో ఈ తొలి ప్రయత్నం చేసినట్లు తెలిపారు. పల్లెటూరి కుటుంబ జీవితం,వ్యక్తిగత అనుభవాలు, జీవితంలో ఎదురైన సమస్యలను మేళవించి'ఓ నా సిద్ధయ్య'పాటను రూపొందించినట్లు వెల్లడించారు. కందట్ల క్రియేషన్స్ బ్యానర్‌పై తన స్వీయ నిర్మాణ సారథ్యంలో ఈ పాటను తెరకెక్కించామని,ప్రజల ఆశీస్సులతో ఈ ప్రయత్నం విజయవంతమవుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. పాట ఆవిష్కరణ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు, అభిమానులు హాజరయ్యే అవకాశం ఉండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు సిద్ధు రెడ్డి తెలిపారు. ప్రేక్షకులు పాటను పెద్ద తెరపై వీక్షించేలా 70 ఎంఎం సినిమా థియేటర్ తరహాలో వేదికను సిద్ధం చేస్తున్నామన్నారు.కార్యక్రమం అనంతరం యూట్యూబ్ వేదికగా పాటను ప్రేక్షకులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. ఈ వేడుకకు సినీ నటుడు సోనూసూద్, ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్‌తో పాటు శ్యామ్, నల్లగొండ గద్దర్, దయాభాను తదితర ప్రముఖులు, తెలంగాణ జానపద కళాకారులు, గాయకులు, సాహిత్యకారులు హాజరుకానున్నట్లు తెలిపారు. సినీ,సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రముఖుల రాకతో కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని నిర్వాహకులు భావిస్తున్నారు. కేవలం వ్యాపార రంగానికే పరిమితం కాకుండా సమాజంలో పది మందికి సహాయపడాలన్నదే తన ప్రధాన లక్ష్యమని సిద్ధు రెడ్డి పేర్కొన్నారు. శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. సిద్ధాంతిలో సుమారు రూ.80 లక్షలతో పాఠశాల నిర్మాణం చేపట్టినట్లు, ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, బోరు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పేదలు,బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఆపద సమయంలో అండగా నిలవడంతో పాటు విద్యారంగ అభివృద్ధికి తన వంతు సహకారం అందించడం కొనసాగిస్తానన్నారు.సామాజిక బాధ్యతలో భాగంగా సిద్ధు రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో సినీ జర్నలిస్టులకు హెల్మెట్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మీడియా సమావేశం సందర్భంగా పలువురు నాయకులు, అభిమానులు సిద్ధు రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, పేదలు,బడుగు బలహీన వర్గాలకు ఆపద సమయంలో అండగా నిలుస్తూ, విద్యారంగ అభివృద్ధి, పాఠశాలల నిర్మాణం,మౌలిక సదుపాయాల కల్పనకు తన సొంత నిధులతో సహకారం అందించడం అభినందనీయమని కొనియాడారు. సామాజిక సేవతో పాటు కళారంగంలోనూ సిద్ధు రెడ్డి మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రామ్, యాక్టర్ కాత్యాయని, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మూసీ బాధితుల సమావేశం వద్ద ఉద్రిక్తత

### రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్ నేత కార్తీక్ రెడ్డి అరెస్ట్

### బాధితులకే అనుమతించడంపై బీఆర్ఎస్ శ్రేణుల అభ్యంతరం





**రాజేంద్రనగర్, (ప్రజావినికిడి): అక్టోబర్ 28,** మూసీ ప్రాజెక్టు ప్రభావిత ప్రజలతో రాజేంద్రనగర్‌లోని వాలంటరీ వద్ద ఎంఆర్‌డీసీఎల్ అధికారులు నిర్వహించిన సంప్రదింపుల సమావేశం ఉద్రిక్తతకు దారితీసింది. సమావేశానికి మూసీ ప్రాజెక్టు బాధితులను మాత్రమే అనుమతించడంపై బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పరిస్థితులు ఒక్కసారిగా వేడెక్కాయి. సమావేశాన్ని వ్యతిరేకిస్తూ అక్కడికి చేరుకున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో పాటు బీఆర్ఎస్ నేత కార్తీక్ రెడ్డిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ పరిణామాల నేపథ్యంలో రాజేంద్రనగర్ పరిధిలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మూసీ ప్రాజెక్టు ప్రభావిత ప్రజలకు ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలను వివరించడంతో పాటు వారి అభిప్రాయాలను తెలుసుకునే ఉద్దేశంతో ఎంఆర్‌డీసీఎల్ అధికారులు సంప్రదింపుల సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బాధితులకు వివరించారు. అయితే, సమావేశానికి బాధితులను మాత్రమే అనుమతించాలన్న నిర్ణయంపై బీఆర్ఎస్ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ క్రమంలో సమావేశం జరుగుతున్న వాలంటరీ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమావేశాన్ని వ్యతిరేకిస్తూ వాలంటరీ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందుగానే అడ్డుకున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేత కార్తీక్ రెడ్డిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమావేశ ప్రాంగణంలోకి ఇతరులను అనుమతించకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరిస్థితిని పర్యవేక్షించారు. సమావేశం నేపథ్యంలో రాజేంద్రనగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. బీఆర్ఎస్ నాయకులు సమావేశ ప్రాంతానికి చేరుకోకుండా ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. వాలంటరీ పరిసరాల్లో భారీగా పోలీసులను మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసుల చర్యలతో సమావేశ ప్రాంగణం వద్ద కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.మూసీ ప్రాజెక్టు ప్రభావిత ప్రజలతో అధికారులు నిర్వహించిన సంప్రదింపుల సమావేశం, సమావేశానికి అనుమతుల విషయంలో బీఆర్ఎస్ శ్రేణులు వ్యక్తం చేసిన అభ్యంతరాలు, కార్తీక్ రెడ్డి అరెస్ట్ పరిణామాలతో రాజేంద్రనగర్‌లో ఈ ఘటన ప్రాధాన్యం సంతరించుకుంది

# సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యా రంగానికి మహర్దశ.

### షాద్‌నగర్ నియోజకవర్గంలో పాఠశాలల అభివృద్ధికి 14.98 కోట్లు

### నియోజకవర్గంలోని ఉన్న పాఠశాలలో 90 అదనపు తరగతి గదులు,38 శౌచాలయాలు మంజూరు

### మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**
షాద్ నగర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను సమగ్రంగా అభివృద్ధి చేసి, విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్థానిక శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు నాబార్డ్ నిధుల నుంచి రూ. 14.98 కోట్లు మంజూరైనట్లు ఈ సందర్భంగా ప్రకటించారు.పాఠశాలల్లో మౌలిక వసతుల విప్లవం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్దే ఉంచుకొని,ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్యనందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు.ఇప్పటికే బూర్గుల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ద్వారా ఆంగ్ల మాధ్యమ విద్య అందుబాటులోకి వచ్చిందని, ఇప్పుడు నియోజకవర్గ వ్యాప్తంగా మౌలిక వసతుల విస్తరణ వేగవంతమైందని చెప్పారు.ఈ నిధులతో నియోజకవర్గానికి మొత్తం 90 అదనపు తరగతి గదులతో పాటు 38 అధునాతన మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు.

**మండలాల వారీగా కేటాయించిన నిధుల వివరాలు:**

**ఫరూక్ నగర్ మండలం**

ఫరూక్ నగర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు (రూ. 70 లక్షలు-5 గదులు),బాలుర ఉన్నత పాఠశాల (రూ.70 లక్షలు- 5 గదులు),ఉర్దూ జడ్పీ హెచ్ఎస్ పాఠశాలకు (రూ. 95 లక్షలు-7 గదులు)అలాగే కిషన్ నగర్ (రూ.30 లక్షలు), ఆర్టీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల (రూ. 40 లక్షలు),ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు (రూ. 27 లక్షలు) కేటాయించారు.
జిల్లేడుచౌదరిగుడమండలంలో కేజీబీవీ (కేజీబీవీ) పాఠశాలకు భారీగా రూ. 3.50 కోట్లతో 21 గదులు,చౌదరిగుడా జడ్పీ హెచ్ఎస్ పాఠశాలకు రూ. 54 లక్షలు (5 గదులు), రావిర్యాల,జాకారం గ్రామాలలో పాఠశాలలకు (8) గదులకు కలిపి రూ.1.08 కోట్లతో 8 గదులు మంజూరయ్యాయి. కొందుర్గుమండల కేంద్రం జడ్పీ హెచ్ ఎస్ పాఠశాల కు రూ. 96 లక్షలు (6 గదులు), ఆగిర్యాల ఎంపీపీస్ కు రూ. 54 లక్షలు (4 గదులు) కేటాయింపులు జరిగాయి. నందిగామ & కొత్తూరు మండలలో నందిగామ జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల కు(5 గదులు),శ్రీనివాసులు గూడ (2 గదులు), అంతిరెడ్డిగూడ (2గదులు), మామిడిపల్లి పాఠశాల (4 గదులు)అలాగే కుమ్మరిగూడ పాఠశాలకు 2 అదనపు గదులు మంజూరయ్యాయిఅన్నారు.
కేశంపేట మండలంకేశంపేట జడ్పీ హెచ్ఎస్ పాఠశాలకు 5 అదనపు గదులు,ఫారుక్ నగర్ మండలంలోని కమ్మదనం ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల అభివృద్ధికి రూ.10 లక్షలు కేటాయించారు. నియోజకవర్గంలోని అన్ని

**గ్రామాల్లో 'హైమాస్ట్' కాంతులు**

కేవలం విద్యారంగమే కాకుండా,పల్లెల సౌకర్యార్థం సర్పంచుల విజ్ఞప్తి మేరకు గతంలో నియోజకవర్గ వ్యాప్తంగా 300 ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందని,రాబోవు రోజులలో మరో 300 ఐమాస్ట్ లైట్లను కేటాయించినట్లు ఎమ్మెల్యేతెలిపారు. కాశిరెడ్డిగూడ, చింతగూడ ,నేరెళ్లచెరువు, కుందేళ్లకుంట గ్రామాలకు 13 ఐమాస్ట్ లైట్లు మంజూరయ్యాయని,అలాగే కేశంపేట మండలంలోని సంగెం, పుట్టోనిగూడ,ఎక్లాస్‌ఖాన్ పేట, బైర్కాన్‌పల్లి,మంగలిగూడ గ్రామాలలో మరో 20 ఐమాస్ట్ లైట్లను త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, గిరిజన ఆదివాసి కోఆర్డినేటర్ రఘునాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, పట్టణ అధ్యక్షుడు నలమోని శ్రీధర్, చౌదరిగుడా మండల అధ్యక్షుడు చంద్రశేఖర్,ఎస్సీ సెల్ చైర్మన్ జంగారీ రవి తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి





**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
ఎల్బీనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హయత్ నగర్ డివిజన్ పరిధిలోని రంగనాయకుల గుట్ట వద్ద జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని,ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి,డివిజన్ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్,గుడాల మల్లేష్,భాస్కర్ సాగర్,ప్రదీప్,స్కైలాబ్,రాకేష్,వెంకటేష్,రవి,రాజు,మధు,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం కోశాధికారిగా శ్రీమతి రేవతి దేదీప్యా ఎన్నిక ఏకగ్రీవం

**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
టీజీవోస్ అసోసియేషన్, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు డాక్టర్ కె రామారావు, శ్రీనేష్ కుమార్ నోరి నేతృత్వం లో కార్యవర్గ సమావేశం బుధవారం రోజు కొంగరకలాన్‌లోని ఐడిఓసి లో పలు కీలక అంశాలను చర్చించి, క్రింది కార్యక్రమాలు ఏకగ్రీవంగా నిర్ణయించింది:
(1)తెలంగాణా గెజిటెడ్ అధికారుల సంఘం సభ్యత్వ నమోదు చేసి వాటి రసీదులను సంఘానికి వెంటనే జమ చేయాలని తీర్మానించడమైనది.(2) రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల హోసింగ్ సొసైటీ ఏర్పాటు చేసుకున్నాము. కావున అందులో రంగారెడ్డి జిల్లా అధికారులను త్వరగా మెంబెర్స్ గా చేర్పించాలని వెంటనే దరఖాస్తులు జమ చేయాలని తీర్మానించడమైనది.
(3) 2027 డైరీ అలాగే క్యాలెండర్ కోసం యాడ్స్ ను వీలైనంత త్వరగా సేకరించాలని తీర్మానించడమైనది.(4) వచ్చే నెలలో టీజీవో అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా జనరల్ బాడీ ని ఏర్పాటు చేసుకోవాలని అదేవిదంగా దానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తీర్మానించడం అయినది.
(5) కొత్తగా ఈ జిల్లాలోని కార్యవర్గ సభ్యులు రిటైర్మెంట్ మరియు వేరే జిల్లాలకు బదిలీ అయినవారి స్థానాలలో క్రింది వారిని కొత్తగా ఎన్నుకోవడం జరిగింది.





1శ్రీమతి దేదీప్య రేవతి కోశాధికారి గా
2రాకేష్,వైస్ ప్రెసిడెంట్
3 శ్రీమతి సైదమ్మ,మహిళా వైస్ ప్రెసిడెంట్
4)యం. శ్రీనివాస్,వైస్ ప్రెసిడెంట్
5మహేస్వర్, జాయింట్ సెక్రటరీ
6యన్. సూర్య, జాయింట్ సెక్రటరీ
7 శ్రీమతి వి. జ్యోత్స్న, కల్చరల్ సెక్రటరీ
8 శ్రీమతి విక్టోరియా రాణి, ఆఫీస్ సెక్రటరీ
9 డాక్టర్ దీప్తి,
ఈ సి మెంబర్ గా ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో శ్రీ నూతనకంటి వెంకట్, అసోసియేట్ ప్రెసిడెంట్, నర్సిరెడ్డి,వైస్ ప్రెసిడెంట్,శ్రీమతి శాంతిశ్రీ, జాయింట్ సెక్రటరీ నాగేశ్వర్ రావు, రాకేష్,శ్రీమతి అనిత,శ్రీమతి జ్యోత్స్న, శ్రీనివాస్, మహేష్, విక్టోరియా రాణి, సూర్య తదితరులు పాల్గొని ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం అలాగే వారి న్యాయమైన హక్కుల పరిరక్షణ కోసం మనమందరం ఐక్యంగా సమష్టిగా పనిచేద్దాం అని పేర్కొన్నారు.

# ఏపీని వణికిస్తున్న అర్నబ్ తుపాను..

### వేర్వేరు ఘటనల్లో 7 మంది మృతి

**అక్టోబర్ 28(ప్రజావినికిడి):**
ఏపీలో అర్నబ్ తుపాను విషాదాన్ని మిగిల్చింది. తుపాను ప్రభావంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఈ క్రమంలో చోటుచేసుకున్న వేర్వేరు ఘటనల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు.వివరాల్లోకి వెళితే, విశాఖపట్నంలో రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మరణించారు. పాత గోశాల సమీపంలో విద్యుత్ స్తంభం కూలి ఒకరు మృతి చెందగా, సింహాచలం బాలాజీనగర్‌లో బిందు అనే వివాహిత ప్రాణాలు కోల్పోయారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోనూ ఇద్దరు మృత్యువాత పడ్డారు. చర్చి వద్ద చెట్టు విరిగిపడటంతో చొక్కా కిశోర్ (45), బొండాడవారి వీధిలో కరెంట్ స్తంభం పడటంతో రాంబాబు (34) దుర్మరణం చెందారు.ఇక, కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదికర ప్రకాశ్ పురంలో ఓ వృద్ధురాలు మరణించారు. పెను గాలులకు గుడిసె కూలిపోవడంతో కొల్లు వెంకాయమ్మ అనే మరో వృద్ధురాలు మరణించారు. అదేవిధంగా అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో విద్యుత్ షాక్‌కు గురై మరో మహిళ మృతి చెందారు. పలు జిల్లాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరగడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# పౌరులే ప్రథమం ఫలితాలే ప్రధానం

**అక్టోబర్ 28,(ప్రజావినికిడి):**



ఎన్నికైన ప్రభుత్వాలకు కేంద్రంలో, రాష్ట్రంలో సారథ్యం వహిస్తూ నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ కాలంలో తొలుత గుజరాత్‌లో, ఆ తర్వాత దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల విస్తరణకు ఆయన నాయకత్వం వహించారు. వాటి పరిమాణంతోపాటు నాణ్యత కూడా గణనీయంగా పెరిగింది. ముఖ్యమంత్రిగా మోడీ హయాంలో గుజరాత్‌లో రహదారులు, విద్యుత్తు, ఓడరేవులు, రవాణా అనుసంధాన వ్యవస్థల్లో వచ్చిన మార్పులు ఆ రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానంలో కీలక భాగంగా నిలిచాయి. జాతీయ స్థాయిలో మౌలిక సదుపాయాల రంగంలో వచ్చిన మార్పులు అత్యంత గణనీయమైనవి. 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు ఉండగా, ఆ సంఖ్య ఇప్పుడు 165కు పెరిగింది. వాటిలో కొన్ని ప్రపంచంలోనే అత్యుత్తమ విమానాశ్రయాల సరసన నిలుస్తున్నాయి. దర్భంగా, గయ వంటి చిన్న నగరాల నుంచి ఢిల్లీ, ముంబై, కోల్‌తతా, బెంగళూరు తదితర నగరాలకు నేడు రోజూ పలుమార్లు విమాన సర్వీసులు నడుస్తున్నాయి.నా కెరీర్ తొలినాళ్లలో నేను పనిచేసిన ప్రాంతాల్లో ఈ నగరాలు కూడా ఉన్నాయి. రైల్వే వ్యవస్థలోనూ భారీ విస్తరణ, ఆధునికీకరణ చోటుచేసుకున్నాయి. ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లు, రైల్వేలైన్ల విద్యుదీకరణ నుంచి వందేభారత్ రైళ్లు అందిస్తున్న ఉన్నత స్థాయి ప్రయాణ అనుభవం, పునరాభివృద్ధి చేసిన రైల్వేస్టేషన్ల వరకు అనేక మార్పులు వచ్చాయి. జాతీయ రహదారులు గణనీయంగా విస్తరించాయి. కొత్త ఎక్స్‌ప్రెస్ వేలు, ఓడరేవులు, మెట్రో రైలు వ్యవస్థలు దేశంలో రవాణా అనుసంధాన స్వరూపాన్నే మార్చేశాయి. నేడు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రయాణించే భారతీయులకు, గతంలో విదేశాలకు వెళ్లినప్పుడు మాత్రమే లభించే రహదారి ప్రయాణ అనుభవం స్వదేశంలోనూ అందుబాటులోకి వచ్చింది. భారత్ లాజిస్టిక్స్ పనితీరు ర్యాంకు గణనీయంగా మెరుగుపడింది. 2014లో 54వ స్థానంలో ఉన్న భారత్ 2023 నాటికి 16 స్థానాలు ఎగబాకి 38వ స్థానానికి చేరుకుంది. అదే సమయంలో స్థూల దేశీయోత్పత్తి (జీడిపి)లో లాజిస్టిక్స్ వ్యయం 7.97 శాతానికి తగ్గింది.ఇది ఆర్థిక పోటీతత్వానికి ఊతమిచ్చింది. కంటికి కనిపించే ఈ మార్పులు సహజంగానే విస్తృత దృష్టిని ఆకర్షించాయి. అయితే, మోడీ పాలనలో వచ్చిన మరింత ప్రాథమికమైన మార్పు ఏమిటంటే, మౌలిక సదుపాయాలను ఎలా భావించాలి, ఎలా ప్రణాళికలు రూపొందించాలి, ఎలా అమలు చేయాలి అన్న విషయంలో పూర్తిగా కొత్త దృక్పథం ఏర్పడటం. నా అనుభవంలో, మౌలిక సదుపాయాల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలకు చాలా అరుదుగా ఒక్క తప్పుడు నిర్ణయమే కారణమవుతుంది. విడివిడిగా చూస్తే సమంజసంగా అనిపించే అనేక నిర్ణయాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోవడమే అసలు సమస్య. ఫలితంగా, అన్ని భాగాల ప్రయోజనాలను కలిపినా సమగ్ర వ్యవస్థ అందించాల్సిన ప్రయోజనం అందదు. ఈ వాస్తవాన్నిమోడీ దాదాపు సహజ సిద్ధమైన అవగాహనతో గుర్తించారు. ఒక నిర్దిష్ట సదుపాయాన్ని నిర్మించే శాఖ కోణం నుంచే మౌలిక సదుపాయాలను చూడకుండా, ఆ నిర్మాణం ద్వారా సాధించాల్సిన విస్తృత ఫలితంపై ఆయన దృష్టి సారించారు.ఫలితాలకు ప్రాధాన్యమిస్తూ, పౌరులను కేంద్రంగా చేసుకునే ఈ దృక్పథం ఆయన పరిపాలనా విధానంలో ప్రధాన లక్షణంగా నిలిచింది. మోడీ విధానంలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం మరో ముఖ్యమైన అంశం. గుజరాత్‌లో బిసాగ్ (బిఐఎస్ ఏజి) సంస్థ ఉపగ్రహ అనువర్తనాలు, భౌగోళిక సమాచార వ్యవస్థలు, ప్రాదేశిక ప్రణాళికల రూపకల్పనలో సామర్థ్యాన్ని పెంపొందించింది. భౌగోళిక సమాచారంతో రాష్ట్ర భౌగోళిక స్వరూపాన్ని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధిని సమగ్రంగా పరిశీలించడం సాధ్యమైంది. భూమి, రహదారులు, జలవనరులు, నివాస ప్రాంతాలు, పరిశ్రమలు, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమాచారాన్ని ఒకచోట చేర్చడం ద్వారా అభివృద్ధిలోని వివిధ అంశాల మధ్య సంబంధాలను మరింత సమగ్రంగా అర్థం చేసుకునే అవకాశం లభించింది. ఈ నేపథ్యమే జాతీయ స్థాయిలో గతి శక్తి కార్యక్రమాన్ని ప్రారంభించడానికి మార్గం సుగమం చేసింది. గుజరాత్‌లో అప్పటికే ఉన్న విధానాన్ని యథాతథంగా దేశవ్యాప్తంగా అమలు చేయడమే పిఎం గతిశక్తి ప్రాధాన్యం కాదు.భౌగోళిక పరిస్థితులు, మౌలిక సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాలను పరస్పరం అనుసంధానమైన అంశాలుగా పరిగణించే పరిపాలనా దృక్పథాన్ని మరింత విస్తృత స్థాయిలో దేశమంతటా అమలు చేయడమే దీని ప్రత్యేకత. వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు సమగ్ర ప్రణాళికలు రూపొందించడంతోపాటు సమన్వయంతో అమలు చేసేలా గతిశక్తి దోహదపడింది. తద్వారా ప్రభుత్వం మొత్తం ఒకే సమగ్ర వ్యవస్థగా పనిచేసే విధానానికి బాటలు పడ్డాయి. గతిశక్తి ప్రారంభానికి ముందు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఉండేది కాదా? అనే ప్రశ్న సహజంగానే తలెత్తవచ్చు. కచ్చితంగా ఉండేది. అయితే, ప్రభుత్వాలు సంప్రదాయంగా అనుసరించిన సమన్వయ విధానానికి, గతిశక్తి వ్యవస్థాగతంగా అమలు చేయాలనుకుంటున్న విధానానికి మధ్య ప్రాథమికమైన తేడా ఉంది.గతిశక్తి, ప్రగతి కార్యక్రమాలు కలిపి మోడీ పరిపాలనా విధానంలోని ఒక ప్రత్యేక లక్షణాన్ని స్పష్టం చేస్తున్నాయి.ఒకవైపు మొత్తం వ్యవస్థను సమగ్రంగా చూడటం, మరోవైపు ఒక్కో ప్రాజెక్టు పనులను నిలిపివేయగల నిర్దిష్ట అడ్డంకులపై దృష్టి పెట్టడం ఈ విధానంలో కనిపిస్తుంది. వివిధ భాగాలు పరస్పరం ఎలా అనుసంధానమై ఉన్నాయో అర్థం చేసుకోకుండా మౌలిక సదుపాయాల ప్రణాళికలను సమర్థంగా రూపొందించలేం. అలాగే, అమలులోని ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిష్కరించకుండా ప్రాజెక్టులను సమర్థంగా పూర్తి చేయలేం. సమగ్ర ప్రణాళికలు, నిరంతర పర్యవేక్షణ, సమస్యల పరిష్కారంపై నిలకడైన దృష్టి.. ఈ మూడింటి సమ్మేళనం వల్ల గతంలో ఎన్నడూ లేనంత విస్తృత స్థాయిలో, మరింత సమర్థంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి సాధ్యమైంది. పౌరులకు ఎలాంటి అంతరాయాలు లేని సౌకర్యవంతమైన అనుభవాన్ని అందించడం, విస్తృత ఆర్థిక వ్యవస్థ ఉత్పాదకతను పెంచడం అనే లక్ష్యాలతో, మొత్తం వ్యవస్థను సమగ్రంగా పరిగణించే విధానాన్ని రాష్ట్ర పాలనలో తీసుకురావడం ఇందులోని అసలు ప్రాధాన్యం.

## కెప్టెన్ స్మిత్ మచ్చర్ తలపై బలమైన గాయం..

## ఎన్ని కుట్లో..! ఫొటో పంచుకున్న ఏపీ బీజేపీ

**అక్టోబర్ 28,(ప్రజావినికిడి):**



"ఈ ఫొటోనే సర్వస్వం చెబుతోంది..!" అనే క్యాప్షన్‌తో ఆంధ్రప్రదేశ్ బీజేపీ శాఖ తన సోషల్ మీడియా ఖాతాలో ఓ ఫొటోను పంచుకుంది. అందులో ఫ్లైదుబాయ్ విమాన పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ తలపై తీవ్రమైన గాయంతో, పెద్ద సంఖ్యలో కుట్లు ఉన్న దృశ్యం అందరినీ కలచివేస్తోంది. ఈ ఫొటో ఆయనపై జరిగిన దాడి తీవ్రతను, ఆయన పడిన బాధను కళ్లకు కడుతోంది. ఇంతటి తీవ్ర గాయంతోనూ ఆయన ప్రదర్శించిన సాహసం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది.వివరాల్లోకి వెళితే, గత నెల సెప్టెంబర్ 30న ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. విమానం గాల్లో ఉండగా కాక్‌పిట్‌లోకి ప్రవేశించిన ఓ వ్యక్తి దాడి చేయడంతో కెప్టెన్ స్మిత్ మచ్చర్ తలకు బలమైన గాయమైంది. అయినప్పటికీ, ఆయన అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించారు. తీవ్ర నొప్పితో బాధపడుతున్నా, సమయస్ఫూర్తితో వ్యవహరించి ఎలాగోలా కాక్‌పిట్ డోర్‌ను తెరిచారు. దీంతో విమాన సిబ్బంది, ఇతర ప్రయాణికులు వెంటనే జోక్యం చేసుకుని దుండగుడిని అదుపులోకి తెచ్చారు. కెప్టెన్ స్మిత్ చర్య వల్ల ఓ పెను ప్రమాదం తప్పి, విమానంలోని 174 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.ఈ అద్భుతమైన ధైర్యసాహసానికి గుర్తింపుగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం కెప్టెన్ స్మిత్, ఆయన సిబ్బందిని ఘనంగా సత్కరించింది. యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ వారికి ప్రతిష్ఠాత్మక 'ఫస్ట్ క్లాస్ ఆర్డర్ ఆఫ్ జాయెద్ ××' పురస్కారాన్ని ప్రదానం చేశారు. అత్యవసర పరిస్థితిలో ప్రయాణికుల భద్రతకు, విమాన సురక్షితత్వానికి వారు చేసిన కృషిని ఈ పురస్కారం గుర్తిస్తుందని యూఏఈ ప్రభుత్వం పేర్కొంది. ఈ అవార్డు తీసుకోవడానికి స్మిత్ వచ్చినప్పుడు తీసిన ఫొటోనే ఏపీ బీజేపీ పంచుకుంది.ప్రాణాపాయ స్థితిలోనూ ప్రయాణికుల భద్రతకే తొలి ప్రాధాన్యం ఇచ్చిన కెప్టెన్ స్మిత్ మచ్చర్ నిజమైన హీరో అంటూ సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది.

# జెండా ఎగరేస్తే జైలుకా?

**అక్టోబర్ 28,(ప్రజావినికిడి):**



జాతీయ జెండా ఎగరేస్తే జైలుకు పంపే దేశంలో ఇప్పుడు మనమున్నామా? ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి నిరసన తెలిపిన కాక్రోచ్ జనతా పార్టీకి చెందిన అశుతోష్ రంకా, సౌరవ్ దాస్ నిర్బంధం ఈ ప్రశ్నను మరోసారి ముందుకు తెచ్చింది. అయితే వారిని కేవలం జాతీయ జెండా ఎగురవేసినందుకే నిర్బంధించారని చెప్పడం సరైనది కాదు. అనుమతి లేని ప్రవేశం, గతంలో ఇచ్చిన శాంతిభద్రతల హామీల ఉల్లంఘన, మళ్లీ అవాంఛనీయ పరిస్థితులు ఏర్పడే అవకాశాల వంటి ఆరోపణలను అధికారులు ప్రస్తావించారు. అక్టోబర్ 14న వారిని ఐదు రోజుల నిర్బంధానికి పంపగా, అక్టోబర్ 19న మరో రెండు రోజులు పొడిగించారు. అక్టోబర్ 21న, జంతర్ మంతర్‌కు తిరిగి అధికారిక నిరసన స్థల హోదా లభించే వరకు అక్కడ నిరసనలకు పిలుపునివ్వబోమని లిఖితపూర్వక హామీ ఇచ్చిన అనంతరం విడుదల చేసినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ పరిణామాలను ఇద్దరు కార్యకర్తల అరెస్టు, విడుదలగా మాత్రమే చూడలేం. నిరసన హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రభుత్వ నియంత్రణ, జాతీయ జెండా గౌరవం మధ్య ఉన్న సంబంధాన్ని పరిశీలించాల్సిన సందర్భమిది.జంతర్ మంతర్: ప్రజల గొంతుక దశాబ్దాలుగా రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు, వివిధ ప్రజా ఉద్యమాలకు జంతర్ మంతర్ వేదికగా నిలిచింది. పార్లమెంటుకు సమీపంలో ప్రజలు తమ సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లే ముఖ్యమైన ప్రదేశమది. నిరసనలకు ఎలాంటి ఆంక్షలూ ఉండకూడదని చెప్పలేం. స్థానిక ప్రజల హక్కులు, శాంతిభద్రతలు, ట్రాఫిక్ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని కొన్ని నియంత్రణలు విధించవచ్చు. కానీ నిరసనలకు సరైన, న్యాయబద్ధమైన ప్రత్యామ్నాయ స్థలాలను చూపించాలి. ఏదో తూ తూ మంత్రంగా చూపించామని చెబితే సరిపోదు. అక్కడ నిరసన తెలిపే ప్రజల గొంతు మీడియాకు, పాలకులకు చేరే అవకాశం ఉందా అన్నదే ముఖ్యం. 2018లో మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ కేసులో సుప్రీంకోర్టు శాంతియుత నిరసన హక్కును గుర్తిస్తూనే, ఇతరుల హక్కులు, ప్రజల శాంతిని కాపాడేందుకు తగిన నియంత్రణలు అవసరమని స్పష్టం చేసింది.జెండా ఎగరేయడం నేరమా? రాజ్యాంగంలోని 19(1)(ఏ) అధికరణం భావప్రకటనా స్వేచ్ఛను, 19(1) (బి) అధికరణం శాంతియుతంగా, నిరాయుధంగా సమావేశమయ్యే హక్కును కల్పిస్తున్నాయి. ఈ హక్కులు సహేతుకమైన రాజ్యాంగ పరిమితులకు లోబడి ఉంటాయి. 2004లో భారత ప్రభుత్వం వర్సెస్ నవీన్ జిందాల్ కేసులో సుప్రీం కోర్టు గౌరవప్రదంగా జాతీయ జెండాను ఎగురవేయడం భావప్రకటనా స్వేచ్ఛలో భాగమని గుర్తించింది. అదే సమయంలో, జాతీయ గౌరవ అవమాన నిరోధక చట్టం -1971లోని సెక్షన్ 2 జాతీయ పతాకాన్ని నిర్దిష్ట విధాలుగా అవమానించే చర్యలను శిక్షార్హంగా పరిగణిస్తుంది. అయితే ప్రభుత్వ విధానాలను విమర్శించడం, జెండాను అవమానించడం రెండూ ఒకటి కావు. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం, ఈ ఇద్దరిపై జాతీయ గౌరవ చట్టం కింద ప్రత్యేక అభియోగం నమోదైనట్లు నిర్ధారణ కాలేదు. అందువల్ల వారిని జెండా అవమానించినందుకు నిర్బంధించారని చెప్పడం తగదు.అయితే, ఈ కేసులో అధికారుల వాదనలను విస్మరించలేం. చట్టబద్ధమైన ఆదేశాలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకునే అధికారం పోలీసులకు ఉంది. కానీ తీసుకున్న చర్య అవసరమైనదా? ఐదు రోజుల నిర్బంధం తప్పనిసరైందా? తక్కువ కఠినమైన ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయా? అనే ప్రశ్నలకు కూడా సమాధానాలు అవసరం. ఈ చర్య రాజకీయ కక్ష సాధింపేనని నిర్ధారించడానికి ఆధారాలు కావాలి. అదే సమయంలో చర్యల సముచితతను ప్రశ్నించడం ప్రజాస్వామిక హక్కు. చట్టం అందరికీ సమానంగా వర్తించాలి; రాజకీయ అభిప్రాయాల ఆధారంగా దాని అమలులో తేడాలు ఉండకూడదు.భారత స్వాతంత్ర్య పోరాటంలో త్రివర్ణ పతాకం వలస పాలనపై అసమ్మతికి, స్వయం పాలన ఆకాంక్షకు ప్రతీకగా నిలిచింది. ఆ చరిత్రను గుర్తు చేసుకోవడం అంటే నేటి పాలనను బ్రిటిష్ పాలనతో సమానంగా చూడడం కాదు. స్వతంత్ర భారతదేశంలో రాజ్యాంగం కల్పించిన హక్కుల విలువను గుర్తించడం. దేశభక్తి అంటే ప్రభుత్వ నిర్ణయాలన్నింటినీ అంగీకరించడం కాదు. దేశాన్ని ప్రేమిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించవచ్చు. జాతీయ జెండాను గౌరవిస్తూ పాలకుల విధానాలను విమర్శించవచ్చు. చట్టాన్ని గౌరవిస్తూనే దాని అమలులోని లోపాలను ప్రశ్నించవచ్చు. జెండా ప్రజలది. రాజ్యాంగం ప్రజలది. దేశం కూడా ప్రజలదే. నిరసనలకు చట్టబద్ధమైన పరిమితులు ఉండవచ్చు. కానీ ఆ పరిమితులు ప్రజల గొంతును మూయడానికి సాధనాలుగా మారకూడదు. జాతీయ జెండా గౌరవాన్ని కాపాడటంతోపాటు, అది ప్రతిబింబించే స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, పౌర గౌరవాన్ని పరిరక్షించడం కూడా ప్రభుత్వ బాధ్యతే. అదే త్రివర్ణ పతాకం మనకు అందించే అసలు సిసలైన సందేశం!

# ధరల భారం నుంచి ఊరట..

## తెలంగాణలో ఇక బియ్యంతో పాటు నిత్యావసరాలు!

**ధరల పెరుగుదల, కరవు భయాలు నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం**

**రేషన్‌పై నిత్యావసరాల పంపిణీకి యోచన**

**కందిపప్పు, గోధుమపిండి, నూనె, చక్కెర వంటివి ఇచ్చేందుకు కసరత్తు**

**ప్రతిపాదనపై అధ్యయనం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశం**

**సాధ్యాసాధ్యాలను పరిశీలించి సంక్రాంతి నాటికి అమలు చేసే అవకాశం**

**అక్టోబర్ 28,(ప్రజావినికిడి):**



తెలంగాణలో పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, ఎల్ నినో ప్రభావంతో కరవు పరిస్థితులు తలెత్తవచ్చన్న ఆందోళనల నేపథ్యంలో పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం రేషన్ కార్డులపై పంపిణీ చేస్తున్న సన్నబియ్యంతో పాటు కందిపప్పు, గోధుమపిండి, పామాయిల్, చక్కెర, చింతపండు, కారంపొడి వంటి మరిన్ని సరుకులను అందించే ప్రతిపాదనను తీవ్రంగా పరిశీలిస్తోంది.

ఈ ప్రతిపాదన సాధ్యాసాధ్యాలపై సమగ్రంగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల అవసరాలు, సరుకుల సేకరణకు ఏర్పాట్లు, ఎంత పరిమాణంలో ఇవ్వాలి? ఎంతకాలం కొనసాగించాలి? బడ్జెట్‌పై పడే భారం వంటి అంశాలను అంచనా వేయాలని సూచించారు. ఆర్థిక, లాజిస్టిక్స్ పరమైన అంశాలు కొలిక్కి వస్తే, వచ్చే సంక్రాంతి నాటికి ఈ పథకాన్ని ప్రారంభించే అవకాశం ఉందని తెలుస్తోంది.

రాష్ట్రంలో ప్రస్తుతం 1.06 కోట్ల ఆహార భద్రత కార్డులపై సుమారు 3.42 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి నెలకు తలసరి 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నారు. ఇందుకు నెలకు 2.18 లక్షల టన్నుల బియ్యం అవసరం. భవిష్యత్ అవసరాల దృష్ట్యా 14 నెలలకు సరిపడా ఆహార ధాన్యాల బఫర్ స్టాక్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం గోదాముల్లో 9.64 లక్షల టన్నుల బియ్యం నిల్వ ఉండగా, కస్టమ్ మిల్లింగ్ రైస్, ఇతర మార్గాల ద్వారా మరో 18.39 లక్షల టన్నులు సమకూరనున్నాయి. ఈ నిల్వలు 2027 సెప్టెంబర్ వరకు సరిపోతాయని అధికారులు భావిస్తున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో రేషన్ షాపుల ద్వారా పలు రకాల నిత్యావసరాలను అందించేవారు. 2023లో అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ కూడా ఇదే తరహాలో పంపిణీని విస్తరిస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు ఆ దిశగానే ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బహిరంగ మార్కెట్‌లో ధరల పెరుగుదల నుంచి ప్రజలను ఆదుకోవడమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందిస్తున్నారు. అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా ఏయే సరుకులు ఎంత పరిమాణంలో ఇవ్వాలనే దానిపై కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుంది

# క్యాన్సర్ చికిత్స ఇక మరింత చవక..

## 543 మందుల ధరలు తగ్గించిన కేంద్రం.. నవంబరు 9 నుంచే అమల్లోకి!

**క్యాన్సర్ చికిత్స మందుల ధరలను సవరించిన కేంద్రం**

**మొత్తం 543 బ్రాండ్ల ఔషధాల వీ=రాల తగ్గింపు**

**నవంబర్ 9 నుంచి కొత్త ధరలు**

**ట్రేడ్ మార్జిన్ల నియంత్రణతో రోగులకు భారీ ఊరట**

**కొన్ని మందుల ధరలు 80 శాతానికి పైగా తగ్గుదల**

**అక్టోబర్ 28(ప్రజావినికిడి):**



క్యాన్సర్ చికిత్స విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. క్యాన్సర్ చికిత్సలో వినియోగించే 543 బ్రాండ్ల ఔషధాల ధరలను సవరిస్తూ జాతీయ ఫార్మాస్యూటికల్ ధరల నిర్ణయ సంస్థ ఓ ప్రకటన చేసింది. ఈ కొత్త ధరలు నవంబర్ 9 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నిర్ణయంతో అత్యంత ఖరీదైన కొన్ని క్యాన్సర్ మందుల ధరలు 80% పైగా తగ్గనున్నాయి.కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఫార్మాస్యూటికల్స్ విభాగం కింద పనిచేసే చీఫ్రాూ, ఈ మేరకు సవరించిన ధరలతో కూడిన జాబితాను విడుదల చేసింది. అక్టోబర్ 17న 137 నాన్-షెడ్యూల్డ్ క్యాన్సర్ మందుల కోసం ట్రేడ్ మార్జిన్ రేషనలైజేషన్ విధానాన్ని ప్రకటించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విధానం ద్వారా మందుల అమ్మకాలపై ఉన్న అధిక ట్రేడ్ మార్జిన్లకు కళ్లెం వేసి, క్యాన్సర్ చికిత్సను మరింత అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ ధరల తగ్గింపు వల్ల రోగులపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గనుంది. ఉదాహరణకు, అబాట్ సంస్థకు చెందిన 'బెవాసిజాబ్' 100 ఇంజెక్షన్ ధర రూ. 21,767 నుంచి రూ. 5,930కి తగ్గింది. అదేవిధంగా, 'ఫుల్‌వెస్ట్రాంట్' 50 ఎస్త్ర ఇంజెక్షన్ ధర రూ. 26,072 నుంచి రూ. 5,491కి దిగివచ్చింది. డాక్టర్ రెడ్డీస్ వారి 'అజాసిటిడిన్' 100 ఎస్త్ర ఇంజెక్షన్ ధర రూ. 6,337 నుంచి రూ. 1,495కి తగ్గింది.

ధరలు తగ్గిన ఈ మందుల జాబితాలో 20కి పైగా క్యాన్సర్ రకాల చికిత్సలో వినియోగించే ఇమ్యునోథెరపీ ఔషధాలు ఉన్నాయి. వీటితో పాటు రొమ్ము, ప్రోస్టేట్ క్యాన్సర్ రోగుల కోసం వాడే డెనోసుమాబ్, న్యూట్రోపెనియా నివారణకు ఉపయోగించే పెగ్‌ఫిల్‌గ్రాస్టిమ్, పెద్దప్రేగు, అండాశయ, గర్భాశయ క్యాన్సర్ల చికిత్సలో వాడే బెవాసిజుమాబ్ వంటి కీలకమైన మందులు కూడా ఉన్నాయి.

ఔషధ తయారీ కంపెనీలు మంగళవారం వరకు అందించిన సమాచారం ఆధారంగా ఈ 543 ఔషధాల జాబితాను రూపొందించింది. మిగిలిన కంపెనీలు కూడా తమ సవరించిన ధరల వివరాలను అందించిన తర్వాత ఈ జాబితాను మరింత విస్తరించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# మూడు ఆసియా పారా గేమ్స్ స్వర్ణాలు సాధించిన నీరజ్ యాదవ్ మృతి

## డోపింగ్ సస్పెన్షన్‌తో ఇటీవల పోటీలకు దూరం.. మృతిపై దర్యాప్తు




**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:** భారత పారా క్రీడా రంగంలో విషాదం చోటుచేసుకుంది. మూడుసార్లు ఆసియా పారా గేమ్స్‌లో స్వర్ణ పతకాలు సాధించిన ప్రముఖ పారా అథ్లెట్ నీరజ్ యాదవ్ మృతి చెందారు. ఆయన తన నివాసంలో విషం తీసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం. ఈ విషయాన్ని భారత పారా అథ్లెటిక్స్ జట్టు ప్రధాన కోచ్ ఎస్. సత్యనారాయణ ధ్రువీకరించారు. ఆయన మృతదేహానికి ఢిల్లీలోని ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించేందుకు తరలించినట్లు సమాచారం.

**క్రీడా జీవితంలో ఎన్నో విజయాలు**

ఉత్తరప్రదేశ్‌కు చెందిన నీరజ్ యాదవ్ చిన్నతనంలోనే పోలియో బారినపడినప్పటికీ, క్రీడలపై ఆసక్తితో ముందుకు సాగారు. తొలుత వీల్‌చైర్ టెన్నిస్‌లో పాల్గొన్న ఆయన, 2015లో పారా అథ్లెటిక్స్ వైపు అడుగులు వేశారు. జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, షాట్‌పుట్ విభాగాల్లో ప్రతిభ చాటారు. 2015లో ఢిల్లీలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మూడు విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించి గుర్తింపు పొందారు. 2018లో ఇండోనేషియాలో జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో పురుషుల ఎఫ్55 జావెలిన్ త్రో విభాగంలో స్వర్ణ పతకం సాధించడంతో పాటు ఆసియా రికార్డు నెలకొల్పారు. అనంతరం 2023లో చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో జావెలిన్ త్రో, డిస్కస్ త్రో విభాగాల్లో మరో రెండు స్వర్ణ పతకాలను గెలుచుకున్నారు. దీంతో ఆసియా పారా గేమ్స్‌లో ఆయన సాధించిన స్వర్ణ పతకాల సంఖ్య మూడుకు చేరింది.

**డోపింగ్ కేసుతో నిలిచిన క్రీడా ప్రయాణం**

2023లో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ నిర్వహించిన పరీక్షలో ఆయన నమూనాలో నిషేధిత పదార్థం ఉన్నట్లు తేలడంతో డోపింగ్ వ్యవహారం తెరపైకి వచ్చింది. ఈ పరీక్ష ఫలితాలను నీరజ్ యాదవ్ సవాలు చేసినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ వ్యవహారంలో ఆయనపై తాత్కాలిక సస్పెన్షన్ విధించారు. దీంతో ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగిన ఐచినగోయా ఆసియా పారా గేమ్స్‌లో ఆయన పాల్గొనలేకపోయారు. పోటీలకు దూరం కావడం వల్ల ఆయన తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఉండవచ్చని కోచ్ అభిప్రాయపడినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. అయితే, నీరజ్ యాదవ్ మృతికి ఇదే కారణమని నిర్ధారించే అధికారిక సమాచారం ఇంకా వెలువడలేదు.

**కారణాలపై కొనసాగుతున్న ఉత్కంఠ**

నీరజ్ యాదవ్ మృతికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనకు దారితీసిన పరిస్థితులు, ఇతర అంశాలపై అధికారులు దర్యాప్తు చేయనున్నారు. చిన్నతనంలో ఎదురైన శారీరక సవాళ్లను అధిగమించి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన అథ్లెట్ మృతి భారత పారా క్రీడా రంగంలో విషాదాన్ని నింపింది.

# టీమిండియా చాలా ప్రమాదకరమైన జట్టు!



## ● అందుకే మా జట్టును ప్రశంసించా.. వెస్టిండీస్ కోచ్ డారెన్ శామీ

**హైదరాబాద్, అక్టోబర్ 28:** న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో టీమిండియా దూకుడైన ఆటతీరుపై వెస్టిండీస్ జట్టు ప్రధాన కోచ్ డారెన్ శామీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత్ అత్యంత ప్రమాదకరమైన జట్టని, అలాంటి జట్టుతో భారత్‌లోనే తలపడి తమ జట్టు సాధించిన ఫలితం గొప్పదని పేర్కొన్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో భారత బ్యాటర్లు చెలరేగిన తీరు తన అభిప్రాయాన్ని మరోసారి గుర్తు చేసిందని సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించాడు.

**బౌలర్లకు సవాలుగా పరిస్థితులు**

చిన్న బౌండరీలు, బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌లు, తడి బంతితో బౌలింగ్ చేయాల్సిన పరిస్థితులు బ్యాటర్లకు కలిసొస్తాయని శామీ పేర్కొన్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో టీమిండియాను ఎదుర్కోవడం ఎంత కష్టమో తాజా మ్యాచ్ మరోసారి నిరూపించిందని తెలిపాడు. ఇటీవల భారత్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ వర్షం కారణంగా చివరి మ్యాచ్ రద్దు కావడంతో 22తో ముగిసింది. ఈ నేపథ్యంలో తమ జట్టు ప్రదర్శనను ప్రశంసించడంలో తప్పేమీ లేదని శామీ వ్యాఖ్యల సారాంశం.

**అభిషేక్ శర్మ విధ్వంసకర ఇన్నింగ్స్**

న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరిగిన మూడో టీ20లో భారత్ అద్భుత విజయాన్ని అందుకుంది. 199 పరుగుల లక్ష్యాన్ని కేవలం 13.2 ఓవర్లలోనే ఛేదించి ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. యువ బ్యాటర్ అభిషేక్ శర్మ కేవలం 38 బంతుల్లోనే 113 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 19 బంతుల్లో 45 పరుగులు సాధించి జట్టు విజయానికి కీలక సహకారం అందించాడు. వీరిద్దరూ కలిసి 7.1 ఓవర్లలోనే 133 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

**భారత్ జోరుకు కివీస్ కళ్లెం వేయగలదా?**

ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 30 ఆధిక్యాన్ని సాధించి సిరీస్‌ను కైవసం చేసుకుంది. వరుస విజయాలతో భారత జట్టు దూకుడు ప్రదర్శిస్తుండగా, మిగిలిన మ్యాచ్‌ల్లోనైనా గెలిచి పరువు నిలబెట్టుకోవాలని న్యూజిలాండ్ భావిస్తోంది. మరోవైపు, భారత్‌తో జరిగిన సిరీస్‌లో తమ జట్టు చూపిన పోరాటాన్ని సమర్థించుకునేలా శామీ వ్యాఖ్యలు చేశాడు. ఆధునిక టీ20 క్రికెట్‌లో బ్యాటర్ల దూకుడు, మైదాన పరిస్థితులు బౌలర్లకు ఎలాంటి సవాళ్లు విసురుతున్నాయో ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.



# పాక్ గడ్డపై చరిత్ర సృష్టించిన లంక బౌలర్!

## ● 30 ఏళ్ల రికార్డు బద్దలు.. ఐదు వికెట్లతో దిల్షాన్ మదుషంక సంచలనం

**లాహోర్, అక్టోబర్ 28:** శ్రీలంక యువ పేసర్ దిల్షాన్ మదుషంక పాకిస్థాన్ గడ్డపై చరిత్ర సృష్టించాడు. వన్డే ముక్కోణపు సిరీస్‌లో భాగంగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో అద్భుత బౌలింగ్‌తో అదరగొట్టాడు. 8.3 ఓవర్లలో 34 పరుగులు మాత్రమే ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. దీంతో పాకిస్థాన్ గడ్డపై ఆతిథ్య జట్టుపై అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన విదేశీ పేసర్‌గా రికార్డు సాధించాడు. ఈ క్రమంలో న్యూజిలాండ్ బౌలర్ క్రిస్ హారిస్ పేరిట ఉన్న 30 ఏళ్ల రికార్డును అధిగమించాడు.

**పాక్ బ్యాటింగ్ పతనం**

లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ శ్రీలంక బౌలర్ల ధాటికి 25.3 ఓవర్లలో 110 పరుగులకే ఆలౌటైంది. బాబర్ ఆజమ్ 29 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. మదుషంక ఫఖర్ జమాన్, సాద్ బేగ్, అరాఫత్ మిన్హాస్, షాహీన్ షా అఫ్రిది, హారిస్ రవూఫ్‌లను పెవిలియన్‌కు పంపాడు. అతడి ధాటికి పాక్ బ్యాటింగ్ కుప్పకూలింది.

**క్రిస్ హారిస్ రికార్డు బద్దలు**

1996లో న్యూజిలాండ్ బౌలర్ క్రిస్ హారిస్ పాకిస్థాన్‌పై 42 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. అప్పటి నుంచి కొనసాగుతున్న రికార్డును మదుషంక 5/34 గణాంకాలతో తిరగరాశాడు. పాకిస్థాన్ గడ్డపై ఆతిథ్య జట్టుపై విదేశీ పేసర్లు సాధించిన అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనగా ఇది నిలిచింది.

**శ్రీలంక ఘన విజయం**

బౌలింగ్‌లో సత్తా చాటిన శ్రీలంక, బ్యాటింగ్‌లోనూ అదరగొట్టింది. 111 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని 18.1 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. కమిందు మెండిస్ అజేయంగా 62 పరుగులు చేయగా, పావన్ రత్నాయకే 23 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో శ్రీలంక ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ముక్కోణపు సిరీస్ ఫైనల్‌కు అర్హత సాధించింది. అద్భుత బౌలింగ్ ప్రదర్శన చేసిన మదుషంకకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

# రాణించిన అభిరథ్, రాహుల్

## - పంజాబ్‌పై హైదరాబాద్ దీటైన పోరు.. తొలి ఇన్నింగ్స్‌లో 193/2



**హైదరాబాద్, అక్టోబర్ 28:** రంజీ ట్రోఫీ మూడో రౌండ్ పోటీల్లో భాగంగా పంజాబ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు దీటుగా బదులిస్తోంది. పంజాబ్ తొలి ఇన్నింగ్స్‌లో 431 పరుగులకు ఆలౌట్ కాగా, రెండో రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ 54 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. అభిరథ్ రెడ్డి, రాహుల్ రాదేశ్ అర్ధశతకాలతో రాణించి జట్టును పోటీలో నిలిపారు.

**సెంచరీకి మూడు పరుగుల దూరంలో అభిరథ్**

హైదరాబాద్ ఓపెనర్ అభిరథ్ రెడ్డి అద్భుత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. 140 బంతులు ఎదుర్కొని 12 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 97 పరుగులు సాధించాడు. సెంచరీకి కేవలం మూడు పరుగుల దూరంలో ఉండగా ఉమేశ్ యాదవ్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ సలీల్ అరోరాకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరోవైపు రాహుల్ రాదేశ్ నిలకడగా ఆడుతూ 154 బంతుల్లో తొమ్మిది ఫోర్లతో 72 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.

**రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం**

తొలి వికెట్‌గా తన్మయ్ అగర్వాల్ రెండు పరుగులకే ఔటవడంతో హైదరాబాద్ 15 పరుగుల వద్ద వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత అభిరథ్, రాహుల్ కలిసి పంజాబ్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు.

రెండో వికెట్‌కు 154 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టుకు బలమైన పునాది వేశారు. ఆట ముగిసే సమయానికి రాహుల్‌తో పాటు కొడిమెల హిమతేజ ఎనిమిది పరుగులతో క్రీజులో ఉన్నాడు.

**సాలిల్ అరోరా శతకం.. పంజాబ్ భారీ స్కోరు**

అంతకుముందు పంజాబ్ వికెట్ కీపర్ బ్యాటర్ సాలిల్ అరోరా 268 బంతుల్లో 11 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 151 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించాడు. ఉమేశ్ యాదవ్ 37 పరుగులతో అజేయంగా నిలిచాడు. చివరి వికెట్‌కు వీరిద్దరూ 116 పరుగులు జోడించడం విశేషం. హైదరాబాద్ బౌలర్లలో కెప్టెన్ సీవీ మిలింద్ నాలుగు వికెట్లు, రక్షణ్ రెడ్డి మూడు వికెట్లు పడగొట్టారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ ఇంకా 238 పరుగుల వెనుకంజలో ఉంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించాలంటే మూడో రోజు హైదరాబాద్ బ్యాటర్లు మరింత బాధ్యతగా ఆడాల్సి ఉంది.

# వైష్ణవి శర్మ సంచలనం.. ఐదు వికెట్లతో అదరగొట్టింది!

## - జింబాబ్వే బ్యాటింగ్ పతనం.. భారత మహిళల జట్టు క్లీన్‌స్వీప్‌పై కన్ను




**వడోదర, అక్టోబర్ 28:** భారత మహిళల క్రికెట్‌లో యువ స్పిన్నర్ వైష్ణవి శర్మ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. జింబాబ్వేతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన చివరి వన్డేలో ఐదు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టు పతనాన్ని శాసించింది. ఆమె ధాటికి జింబాబ్వే మహిళల జట్టు 39.5 ఓవర్లలో 131 పరుగులకే కుప్పకూలింది. వైష్ణవి 39 పరుగులిచ్చి ఐదు వికెట్లు తీసుకుంది. అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో ఆమెకు ఇదే తొలి ఐదు వికెట్ల ఘనత కావడం విశేషం.

**వరుసగా వికెట్లు తీసి.. ప్రత్యర్థికి షాక్**

ఎడమచేతి వాటం స్పిన్నర్ వైష్ణవి తన బౌలింగ్‌తో జింబాబ్వే బ్యాటర్లను తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. బెలవ్డ్ బిజా (1), మోడెస్టర్ ముపాచిక్వా (37), చిడెజా ధురురు, మిషెల్ మవుంగా, న్యాషా గ్వాంజురాలను పెవిలియన్‌కు పంపింది. దీంతో జింబాబ్వే భారీ స్కోరు సాధించే అవకాశాలు దెబ్బతిన్నాయి. భారత బౌలర్లలో సయాలి సత్ఘరే, క్రాంతి గౌడ్ చెరో రెండు వికెట్లు పడగొట్టి తమ వంతు సహకారం అందించారు.

**రెండో వన్డేలోనూ మెరిసిన వైష్ణవి**

ఈ సిరీస్‌లో వైష్ణవి నిలకడైన ప్రదర్శన చేస్తోంది. రెండో వన్డేలోనూ నాలుగు వికెట్లు తీసి జింబాబ్వే బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీసింది. ఆ మ్యాచ్‌లో భారత జట్టు 121 పరుగుల తేడాతో విజయం సాధించి మూడు వన్డేల సిరీస్‌లో 20తో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించింది. చివరి వన్డేలోనూ వైష్ణవి ఐదు వికెట్లతో చెలరేగడంతో భారత బౌలింగ్ బలం మరోసారి బయటపడింది.

**క్లీన్‌స్వీప్‌కు భారత్ సిద్ధం**

మూడో వన్డేలో జింబాబ్వేను 131 పరుగులకే పరిమితం చేయడంతో భారత్ ముందు 132 పరుగుల లక్ష్యం నిలిచింది. ఈ మ్యాచ్‌లోనూ విజయం సాధిస్తే మూడు వన్డేల సిరీస్‌ను 30తో క్లీన్‌స్వీప్ చేసినట్లవుతుంది. యువ బౌలర్ వైష్ణవి శర్మ ప్రదర్శన భారత మహిళల జట్టుకు మరింత ఆత్మవిశ్వాసాన్ని అందించింది.

# ఏఐ ప్రమాదకరం

## : డీప్ ఫేక్ వీడియోలపై కృతి సనన్ పోరాటం



ప్రముఖ బాలీవుడ్ నటి కృతి సనన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) దుర్వినియోగంపై న్యాయపోరాటానికి దిగారు. తన వ్యక్తిత్వ, ప్రచార హక్కులను (పర్సనాలిటీ అండ్ పబ్లిసిటీ రైట్స్) కాపాడాలంటూ ఆమె ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఏఐ టెక్నాలజీని ఉపయోగించి తన అనుమతి లేకుండా డీప్‌ఫేక్ వీడియోలు, ఫేక్ ఎండార్స్‌మెంట్లు సృష్టించకుండా అడ్డుకోవాలని ఆమె కోరారు.

ఈ పిటిషన్‌పై జస్టిస్ పురుషైంద్ర కుమార్ కౌరవ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. వ్యక్తిత్వ హక్కులకు సంబంధించిన అంశాలపై మరిన్ని వివరాలు, గత తీర్పులను సమర్పించాలని కృతి తరఫు న్యాయవాదులను ఆదేశిస్తూ, తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది.

ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడిన కృతి సనన్, ఏఐ టెక్నాలజీ తనను తీవ్రంగా భయపెడుతోందని వ్యాఖ్యానించారు. "ఏఐ ఒక పదునైన కత్తి లాంటిది, అది ఎంత పదునుగా ఉంటే అంత ప్రమాదకరం" అని ఆమె అన్నారు. సోషల్ మీడియాలో ఏఐ ద్వారా సృష్టించిన తన ఫొటోలను రిపోర్ట్ చేయడానికి సరైన నిబంధనలు కూడా లేవని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఆమె కోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యత సంతరించుకుంది.



# నవీన్ చంద్ర హీరోగా నటిస్తున్న 51వ సినిమా షూటింగ్ పూర్తి



విలక్షణ నటుడు నవీన్ చంద్ర హీరోగా నటిస్తున్న కొత్త సినిమా షూటింగ్ పూర్తయింది. ఆయన కెరీర్‌లో ఇది 51వ చిత్రం కావడంతో, తాత్కాలికంగా 'ఎన్‌సీ 51' అనే టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్‌ను పిలుస్తున్నారు. ఆర్.పి. బాల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ చెన్నైలో ముగిసింది. ఈ విషయాన్ని నవీన్ చంద్ర స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు.

ఈ చిత్రంలో నవీన్ చంద్ర సరసన హరిప్రియ రోషిణి హీరోయిన్‌గా నటిస్తుండగా, బాల శరవణన్, కాళీ వెంకట్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఓ వినూత్నమైన కథాంశంతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచేలా ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది.దర్శకుడు ఆర్.పి. బాల ఈ చిత్రానికి నిర్మాతగా కూడా వ్యవహరిస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ పి.జి. ముత్తయ్య మరో నిర్మాతగా ఉంటూ సినిమాకు ఛాయాగ్రహణం అందిస్తున్నారు. శక్తి బాలాజీ సంగీతం, అజయ్ మనోజ్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. అధికారిక టైటిల్, ఫస్ట్ లుక్ వివరాలను త్వరలో ప్రకటించనున్నారు.

# 'దొంగ నా కొడుకు' నుంచి 'ఓ మై గాడ్' సాంగ్ రిలీజ్!




పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై వస్తున్న వినూత్న చిత్రం 'దొంగ నా కొడుకు'. మౌళి తనూజ్ ప్రశాంత్ హీరోగా నటిస్తున్న ఈ క్రైమ్ కామెడీ సినిమాకు శ్రీను కంబాల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నవంబర్ 13న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సినిమాపై అంచనాలను పెంచేలా మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ప్రారంభిస్తూ తాజాగా 'ఓ మై గాడ్' ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేశారు. ఆ విశేషాలు ఇప్పుడు చూద్దాం! రామ్ మిరియాల ఎనర్జిటిక్ వాయిస్‌తో మ్యాజిక్: సింజిత్ ఎర్రమిల్లి స్వరపరిచిన 'ఓ మై గాడ్' పాట రొమాంటిక్‌గా, జోష్ నింపేలా ఉంది. ఆకట్టుకునే మ్యూజిక్, కొత్త తరహా బీట్స్ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇక సింగర్ రామ్ మిరియాల తనదైన ఎనర్జీ, ప్రత్యేకమైన వాయిస్‌తో ఈ పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు. ఆయన డైనమిక్ వోకల్స్ పాటను మరో లెవెల్‌కి తీసుకెళ్లాయని చెప్పవచ్చు. భాస్కరభట్ల చక్కటి సాహిత్యం: ప్రేమలో పడిన హీరో తన మనసులోని ఫీలింగ్స్ భాస్కరభట్ల సాహిత్యం ద్వారా అందంగా పలికించారు. తన జీవితంలోకి ప్రేయసి వచ్చిన తర్వాత ఎలాంటి మార్పులు చోటుచేసుకున్నాయి, ఆమెతో గడిపే ప్రతి క్షణం ఎందుకు ప్రత్యేకంగా అనిపిస్తుందో ఈ పాటలో చూపించారు. ప్రేమలో కలిగే కొత్త ఉత్సాహం, అనుభూతులను ఈ పాట ఆకట్టుకునేలా రాసారు.అదిరిపోయే కొరియోగ్రఫీ: ఈ పాటకు ఆట సందీప్ అందించిన కొరియోగ్రఫీ చాలా అందంగా ఉంది. హీరో మౌళి తనూజ్ ప్రశాంత్ తన ఎనర్జిటిక్ డ్యాన్స్‌తో ఆకట్టుకోగా, హీరోయిన్ సుష్మిత శెట్టితో ఆయన ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ఎంతో క్యూట్‌గా ఉంది. ఇక యూత్‌ఫుల్ రొమాంటిక్ వైబ్‌తో సాగిన ఈ పాట మ్యూజిక్ లవర్స్‌ను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలోనూ ఈ సాంగ్ ట్రెండ్ అవుతోంది. భారీ తారాగణం.. త్వరలోనే రిలీజ్: ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన మూవీ ఇప్పుడు ఈ మెలోడీ సాంగ్‌తో సినిమా ప్రమోషన్లను జోరుగా కొనసాగిస్తోంది. ఈ చిత్రంలో అలీ, రజిత, రఘుబాబు, ప్రియా, గుండు సుదర్శన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇక నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

# లాస్ ఏంజిల్స్‌లో 'రామాయణ' స్పెషల్ స్క్రీనింగ్..




భారత సినీ పరిశ్రమలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో, ఎన్నో అంచనాల నడుమ తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ'. నితేశ్ తివారీ దర్శకత్వంలో, రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

నవంబర్ 5న దీపావళి కానుకగా మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం అక్టోబర్ 27న లాస్ ఏంజిల్స్‌లో ఒక ప్రత్యేక ప్రీమియర్ షోను ఏర్పాటు చేసింది. ఈ ప్రదర్శన అనంతరం సినిమాపై తొలి రివ్యూలు సోషల్ మీడియాలో వచ్చేశాయి.

సినిమా చూసిన వారిలో చాలామంది దీన్ని ఒక అద్భుతమైన దృశ్యకావ్యంగా అభివర్ణించారు. విజువల్స్, సంగీతం, యాక్షన్ సన్నివేశాలు కనీవినీ ఎరుగని రీతిలో ఉన్నాయని కొనియాడారు. ఒక నెటిజన్ రాస్తూ.. ""రామాయణ: రైజ్ ఆఫ్ ఏ లెజెండ్' అద్భుతంగా ఉంది. విజువల్స్, నృత్యాలు, సంగీతం, యాక్షన్ అన్నీ భారీ స్థాయిలో ఉన్నాయి. రణ్‌బీర్ కపూర్ నటన అమోఘం, యశ్ చాలా ఆకర్షణీయంగా కనిపించారు. ఈ ఏడాది అత్యంత గొప్ప సినిమాటిక్ అనుభవాలలో ఇదొకటి" అని పోస్ట్ చేశారు.మరొకరు "వచ్చే వారం బాక్సాఫీస్ వద్ద విధ్వంసం ఖాయం. బ్లాక్‌బస్టర్ గ్యారెంటీ! నటీనటులందరూ అద్భుతంగా నటించారు" అంటూ ప్రశంసించారు. ముఖ్యంగా శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటనకు ప్రేక్షకులు భావోద్వేగానికి గురయ్యారని పలువురు పేర్కొన్నారు. "రామాయణ చిత్రం ప్రేక్షకులను కంటతడి పెట్టించింది. రణ్‌బీర్ ఒక అసాధారణ నటుడు. మేం గెలిచేశాం!" అంటూ ఒక అభిమాని తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ ప్రత్యేక ప్రదర్శనకు నిర్మాత నమిత్ మల్హోత్రా, దర్శకుడు నితేశ్ తివారీ దంపతులు, రణ్‌బీర్ కపూర్, యశ్, సాయిపల్లవి వంటి తారలందరూ సంప్రదాయ దుస్తుల్లో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

కాగా, సినిమాలో ఆత్మ లోపించిందని, దైవిక భావన లేదని, సంగీతం ఆశించిన స్థాయిలో లేదని కొందరు అభిప్రాయపడ్డారు.ఈ సినిమాను రెండు భాగాలుగా, సుమారు రూ.4000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా గతంలో వెల్లడించారు. "ఏడెనిమిదేళ్ల క్రితం ఈ ప్రాజెక్ట్ మొదలుపెట్టినప్పుడు అందరూ నన్ను పిచ్చివాడిలా చూశారు. ప్రపంచంలోనే గొప్ప ఇతిహాసాన్ని ప్రపంచ ప్రేక్షకుల ముందుకు తీసుకెళుతున్నాం. హాలీవుడ్ సినిమాలతో పోలిస్తే మేం చాలా అద్భుతంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం" అని ఆయన తెలిపారు.

మొత్తం మీద 'రామాయణ' చిత్రం అద్భుతమైన విజువల్స్, నటీనటుల ప్రతిభతో ప్రశంసలు అందుకుంటోంది. ఈ స్పందనల నడుమ నవంబర్ 5న విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి అద్భుతాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.



## సందీప్ కిషన్ 'పవర్ పేట'..

# 'పడమటి వీధి జానకి'గా రితికా నాయక్..

యంగ్ హీరో సందీప్ కిషన్ నటిస్తున్న ఆసక్తికర చిత్రం 'పవర్ పేట'. ఈ సినిమా నుంచి హీరోయిన్ రితికా నాయక్ పుట్టినరోజు (అక్టోబర్ 27) సందర్భంగా ఆమె పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో ఆమెను 'పడమటి వీధి జానకి' అనే విభిన్నమైన పేరుతో పరిచయం చేశారు.విడుదలైన పోస్టర్‌లో రితికా నాయక్ ఎంతో సాంప్రదాయబద్ధంగా, హోమ్లీ లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. క్రీమ్ కలర్ హాఫ్ శారీ, పింక్ దుపట్టా, స్లీవ్‌లెస్ బ్లౌజ్‌తో పాటు సాంప్రదాయ ఆభరణాలు ధరించి, పాతకాలం నాటి ఇంట్లో హుందాగా కూర్చుని కనిపించారు. ఈ లుక్ ఆమె పాత్రపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే, పోస్టర్‌లో డీగ్లామర్‌గా కనిపిస్తున్నప్పటికీ, సినిమాలో ఆమె కొన్ని గ్లామరస్ సన్నివేశాల్లో కూడా నటిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా వర్షంలో కొన్ని సీన్లు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. రాజకీయం, ప్రేమ, అధికార పోరాటం వంటి అంశాల నేపథ్యంలో ఈ సినిమాను టాలెంటెడ్ డైరెక్టర్ కృష్ణ చైతన్య తెరకెక్కిస్తున్నారు. సందీప్ కిషన్ ఇందులో 'సేనాపతి రవి' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. మణిశర్మ సంగీతం అందిస్తుండగా, 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ 60 శాతం పూర్తయింది.'మిరాయ్', 'కొరియన్ కనకరాజు' వంటి విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న రితికా నాయక్ ఈ చిత్రంలో కథానాయికగా ఎంపిక కావడం విశేషం. గతంలో ఈ ప్రాజెక్ట్ పలువురు హీరోల వద్దకు వెళ్లినప్పటికీ, చివరికి సందీప్ కిషన్‌తో ఖరారైంది. తాజాగా విడుదలైన 'పడమటి వీధి జానకి' గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచింది. సందీప్, రితికా మధ్య కెమిస్ట్రీ ఎలా ఉండబోతుందోనని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613